W
131

అంతర్జాతీయ రాజకీయాలు

[మార్క్సిస్టు సింహావలోకన]

★

రచన

ఎడ్వర్డ్ కార్డెల్జ్

అనువాదం

'ప్రవాసి'

★

ప్రజాశక్తి ప్రచురణాలయం

: : బెజవాడ : :

ప్రచురణ నెం 222

ప ద జా లు

ప్రజాశక్తి ప్రెస్, బెజవాడ
3. 18/వి.—3000—21.6.47

I

పరిచయం

యుగోస్లావియా ప్రజలు కామ్రేడ్ 'టిటో' నాయకత్వాన, కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన నాజీ దురాక్రమణ దారులను ఓడించారు. తమ దేశంలో వివిధజాతుల ప్రజలకు స్వయంనిర్ణయ హక్కును యిచ్చి, ప్రజారాజ్యాల ఫెడరేషను స్థాపించుకున్నారు. జమీందారీ విధానాన్ని రద్దుచేసి భూమిని సైతాంగానికి పంచారు. కీలకపరిశ్రమలను ప్రజాప్రభుత్వం స్వాధీనం చేసికొని, ప్లానుప్రకారం పరిశ్రమల పునర్నిర్మాణం చేస్తోంది. విద్యా – విజ్ఞానాభివృద్ధికి కృషిచేస్తూ నూతన యుగోస్లావియాను, ప్రజానాగరికతను నిర్మించుతోంది.

ఎడ్వర్డ్ కార్డెల్ యుగోస్లావియా కమ్యూనిస్టు నాయకులలో ఒకరు. యుగోస్లావియా మాసపత్రిక 'కమ్యూనిస్టు'లో 1947 జనవరి సంచికలో అంతర్జాతీయ సమస్యలను చర్చించుతూ వ్యాసం వ్రాశారు. దానినే పీపుల్సు పబ్లిషింగ్ హౌసు కరపత్రంగా పునర్ముద్రించింది. దాని అనువాదమే యీ పుస్తకం.

నేడు అమెరికా సామ్రాజ్యవాదులు ప్రపంచాధిపత్యం కోసం కృషిచేస్తున్నారు. డాలర్ రాక్షసుని కబంధ హస్తాలు ప్రపంచ ప్రజలను తమ కౌగిలిలో బంధించడానికి సాచబడుతున్నాయి. బ్రిటిష్ సామ్రాజ్యవాదులు వలస రాజ్యాలకు 'స్వాతంత్ర్యం' యిచ్చివేస్తున్నామని కల్లబొల్లి కబుర్లు చెబుతున్నారు. ఇదేస్వాతంత్ర్యం — ఇదే మోక్షం, అంటూ బ్రిటిషు వాళ్ళు ఒకప్లానును భారత ప్రజల

నెత్తిని రుద్దారు. ప్రధానరాజకీయపార్టీలు కాంగ్రెసు 'లీగులు' ఇపుడింతకంటే గత్యంతరంలేదని తలవొంచి స్వీకరించాయి. ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదుల కుట్రలను, వివిధ దేశాలలోని విద్రోహశక్తుల పాత్రను, అర్థంచేసికోడానికి యీ చిన్న పుస్తకం ఉపయోగించుతుంది.

ఈ పుస్తకమూ, వార్గా వ్రాసిన Anglo - American Drive For World Domination అను పుస్తకమూ, కలసి అధ్యయనతరగతులలో అంతర్జాతీయ విషయాలను బోధించడానికి వినియోగపడతాయి. కామ్రేడ్స్ వీటిని పార్టీసభ్యులకు రాజకీయశిక్షణ తరగతులలో పూర్తిగా ఉపయోగించుకుంటారని ఆశించుచున్నాము. ఆ దృష్టితోనే దీనిని వెంటనే అనువదించి ప్రకటించుచున్నాము.

ఇట్లు,

10—6—1947. అనువాదకుడు.

★

111
వేమన పంచాయతీ గ్రంథాలయం,
తెల్లప్రోలు :: కృష్ణాజిల్లా

అంతర్జాతీయ రాజకీయాలు

హిట్లరు వగైరా ఫాసిస్టు రాక్షసులను ఓడించి చాలా కాలమయింది. కాని ప్రపంచం యింకా శాంతిసౌఖ్యాలను పూర్తిగా అనుభవించడం లేదు. ప్రపంచంలో అనేక ప్రాంతాలలో యింకా తీవ్రమైన పోరాటం కొనసాగుతూంది. అంతర్జాతీయ సమావేశాలను చూసినా, వివిధ దేశాలమధ్య సంబంధాలను పరిశీలించినా, నేడు ప్రపంచంలోవున్న పరస్పర వైరుధ్యాలు స్పష్టంగా గోచరించుతాయి. రెండో ప్రపంచ యుద్ధం పెట్టుబడిదారీ విధానాన్ని ప్రపంచ సంక్షోభాన్నుంచి రక్షించలేక పోయిందనీ, మరింత తీవ్రతకు మాత్రమే దారి తీసిందనీ, తేటతెల్లమవుతుంది. ఎప్పటి మాదిరిగానే పెట్టుబడిదారీ విధానం తన్ను తాను రక్షించుకోడానికి మరింత సంకుచిత పద్ధతులను, హింసాకాండను అవలంబించుతోంది. యుద్ధం ముగిసిన మరునాటినుంచీ సామ్రాజ్యవాదులు ప్రజాస్వామిక శక్తులపైన సాగించుతున్నదాడి దీనినే రుజువు చేస్తున్నది. వివిధదేశాల మధ్యనున్న అంతర్జాతీయ సంబంధాలు దీనినే ప్రతిబింబించుతున్నాయి. ప్రతి పెట్టుబడిదారీ దేశంలోనూ వస్తున్నఘర్షణలు దీనినే రుజువు చేస్తున్నాయి.

ఇవన్నీ పెట్టుబడిదారీ ప్రపంచం ఎదుర్కోవలసివున్న, రానున్న మహాసంక్షోభానికి (ప్రళయానికి) ప్రాతిపదికలు మాత్రమే. రానున్న సంవత్సరాలలో పెట్టుబడిదారీ ప్రపంచం కొంత కుదటబడటానికి అవకాశాలు లభించబోవు. అంతేకాదు. ఆర్థిక సంక్షోభం, పరస్పర వైరుధ్యాలు మరింత తీవ్ర

మవుతాయి. రాబోవు సంవత్సరాలలో పెట్టుబడిదారీ ప్రపంచంలో మహా సంక్షోభానికి, తీవ్రమైన రాజకీయ విప్లవాలకు దారితీస్తాయి.

ప్రపంచ రాజకీయాలు భవిష్యత్తులో ఎలా పరిణమించుతాయో అనే విషయాన్ని గురించి ప్రజాసామాన్యంలో కొంతగందరగోళంగావుంది. పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజాస్వామిక వాదులలోకూడా యీగందరగోళంవుంది. అందుచేత సామ్రాజ్యవాదులు డెమాక్రసీ ముసుగు వేసికొని బూటకపు నినాదాలు వల్లించి ప్రజాసామాన్యాన్ని మోసపుచ్చే అవకాశాలు వున్నాయి. యుద్ధపుపొగలు యింకా పూర్తిగా తొలగిపోలేదు. అందుచేత చాలామంది ప్రజలు నిన్న జరిగిపోయిన ఘటనలను నేటి వాస్తవిక పరిస్థితుల దృష్టినుంచి చూడటం యింకా నేర్చుకోలేదు. ఫాసిస్టు వ్యతిరేక యుద్ధ నినాదాల ప్రభావం ప్రజలలో కొంతమందిపైన యింకా అలాగేవుంది. ఆ నినాదాలను నేడు సామ్రాజ్యవాదులు, విద్రోహులు వల్లించు తున్నారనీ, అనుమానాలు - గందరగోళం కలిగించడానికి పూతపదాలుగా ప్రయోగించు తున్నారనీ, ప్రజలు గ్రహించడంలేదు. ఒకప్పుడు మహత్తరమైన నినాదాల చాటున నేడు ప్రపంచంలో ఫాసిస్టు విద్రోహక శక్తులు దాగుతున్నాయి. ప్రజాసామాన్యం క్రమంగా యీ సత్యాన్ని గుర్తించుతున్నారనడానికికూడ సందేహంలేదు. అందుచేత సామ్రాజ్య వాదులకు, విద్రోహశక్తులకు క్రమముగా యీనినాదాల చాటున దాక్కోడం కష్టసాధ్యం అవుతోంది. కాబట్టే తమమాట సాగించుకోడానికి వారు దౌర్జన్య పద్ధతులు అవలంబించ వలసి వస్తూంది. అంతర్జాతీయ

సంబంధాలలోనూ, వివిధ పెట్టుబడిదారీ దేశాల అంతర్గత విషయాలలోనూకూడ యిలాగే జరుగుతోంది.

నాజీ జర్మనీ నాయకత్వానవున్న ఫాసిస్టు రాజ్యాలు యుద్ధంలో నాశనం చేయబడ్డాయి. ఆ దేశాలలోని ఫాసిస్టు నియంతృత్వాలు కూలదోయబడ్డాయి. ఐనప్పటికీ ఫాసిస్టు ప్రమాదం పూర్తిగా తొలగిపోలేదు. వివిధ ఖండాలలో కోట్లకొలది ప్రజలు వేటికొరకు పోరాడారో, లక్షలకొలది ప్రజలు వేసికొరకు మరణించారో, ఆ ప్రజాస్వామిక సూత్రాలు ప్రపంచంలో అమలు జరిగాయా? దురదృష్టవశాత్తు అలా జరుగలేదు. హిట్లరు ఫాసిస్టుముఠా, దాని ఉపగ్రహాలు నాశనమయ్యాయి; గాని సామ్రాజ్యవాదముయొక్క దళగా ఫాసిజం నాశనంకాలేదు. అంటే ఫాసిజంయొక్క పునాదులు, కూకటివేళ్ళు నాశనంకాలేదు అని స్పష్టంగా గుర్తుంచుకోవాలి. అందుచేత 'ఫాసిజం చిహ్నాలు మిగిలిపోయాయి' అనడం నాకు సరిగా కన్పించడంలేదు. ఏమంటే మనం ఎదుర్కోవలసింది జర్మనీ, ఇటలీ, జపానువగైరా దేశాలలో 'మిగిలిపోయిన ఫాసిస్టుచిహ్నాలను' మాత్రమేగాదు. అన్నిటి కంటే ఫాసిజం పుట్టుకకు మూలకారణమైన విధానము, పరిస్థితులు అలాగే వున్నాయనే సత్యాన్ని మనం గమనించాలి. ప్రపంచంలో ఫాసిజం పుట్టుకకు మూలకారణాలు-కొంతబల హీనపడినా-అలాగే వున్నాయనేది నిజం. అవి క్రమక్రమంగా ఉధృతరూపం పొందుతున్నాయి. కొన్ని దేశాలలో వాటి పలుకుబడి హెచ్చుతూంది. స్వాతంత్ర్యాభిలాషులయిన మానవలోకానికి ప్రమాదంగా పరిణమించబోతున్నాయి. ప్రతి దేశంలోనూ, అంతర్జాతీయంగానూ కూడ ప్రజాస్వామిక

శక్తులు ఎదిరించి పోరాడకపోతే ఫాసిస్టు అంకురాలు నిజంగానే ప్రమాదానికి దారితీస్తాయి.

'మార్క్సిజం', 'సామ్రాజ్యవాద ఆర్థికతత్వం' అనే వ్యాసాలలో లెనిన్ యిలా వ్రాశాడు :

"పెట్టుబడిదారీ ఆర్థిక విధానంలో గుత్తాధికారుల ప్రాబల్యం అనగా సామ్రాజ్యవాదం ఏర్పడగానే రాజకీయ విధానంలోకూడ మార్పువస్తుంది. డెమాక్రసీనుంచి రియాక్షన్‌కు (నియంతృత్వానికి) దారితీస్తుంది. స్వేచ్ఛాపోటీకి తగిన రాజకీయరూపం డెమాక్రసీ; గుత్తాధికారానికి తగిన రాజకీయరూపం నియంతృత్వం".

అదే వ్యాసంలో రెండవ అంతర్జాతీయ సభలో ప్రముఖుడయిన హిల్ఫర్‌డంగ్ 'ఫైనాన్సు కేపిటల్' అనే పుస్తకంలో వ్రాసిన వాక్యాలను లెనిన్ ఉదహరించాడు. "ఫైనాన్సు కేపిటల్ నియంతృత్వానికి దారితీస్తుంది, స్వాతంత్ర్యంవైపుకాదు".

కాని ప్రథమ ప్రపంచ యుద్ధకాలంలో హెల్ఫర్‌డంగ్ తనమాటలను తానే మరచిపోయాడు. అదేవిధంగా నేటి సోషల్ డెమాక్రేటులుకూడా మరచి పోతున్నారు. మొదటి ప్రపంచయుద్ధం తరువాతనూ, రెండవ ప్రపంచయుద్ధ కాలంలోనూ, తరువాతనూకూడా పెట్టుబడిదారీ ప్రపంచగతి అడుగడుక్కీ లెనిన్ వ్రాతలు సత్యమయ్యాయని రుజువయింది.

స్వాతంత్ర్యాభిలాషులంతా యీ వాస్తవిక పరిస్థితులను దృష్టిలో వుంచుకోవాలి. ప్రపంచంలో అన్ని భాగాలలోనూ సామ్రాజ్యవాద - విద్రోహశక్తులతో కృత నిశ్చయంతో పోరాడాలి. లేనిచో మరో ప్రపంచయుద్ధాన్ని ఎదుర్కోవలసిన గతిపడుతుందనే సంగతిని గుర్తించుకోవాలి.

7

1. ప్రపంచాధిపత్యంకోసం అమెరికా ప్రయత్నాలు

పెట్టుబడిదారీ విధానం అభివృద్ధిచెందడంలో వున్న హెచ్చుతగ్గులు, వాటి పర్యవసానంగా వచ్చే ఫలితాలు యుద్ధకాలంలోనూ, తరువాతనూ కూడ స్పష్టంగా ద్యోతకమయ్యాయి. ప్రపంచ రాజకీయరంగంలోనుంచి జర్మనీ, జపానులు బలహీనమైన రాజ్యాలుగా బైటపడ్డాయి. ఇటలీ పూర్తిగా అప్రధానమైన స్థానంలోకి పోయింది. ఫ్రాన్సు పాత్ర ప్రాముఖ్యతచాలా తగ్గిపోయింది. అమెరికా బలానికి, రాజనీతికి వంతపాడేస్థితికి ఒప్పుకుంటే తప్ప బ్రిటీషు సామ్రాజ్యాన్ని రక్షించుకోడానికి మరోమార్గం లేదని కొన్నివర్గాలు అనుకునే దశకు బ్రిటను వచ్చింది. పెట్టుబడిదారీ ప్రపంచానికి కేంద్రంగా పెట్టుబడిదారీ యూరపు యిక కేంద్రంగా లేదు. పెట్టుబడిదారుల చూపు, విద్రోహశక్తుల చూపు మరోవైపు ప్రసరించుతోంది. వారంతా నేడు అమెరికా ఖండంవైపు ఆశతో చూస్తున్నారు.

పెట్టుబడిదారీ యూరపు బలహీనపడింది. అమెరికా సంయుక్తరాష్ట్రాల ప్రాముఖ్యత విపరీతంగా పెరిగింది. ఆర్థిక ప్రాముఖ్యత, రాజకీయ పలుకుబడినిబట్టి అమెరికా, పెట్టుబడిదారీ ప్రపంచానికి కేంద్రం అయింది. ఒకప్పుడు మనం పెట్టుబడిదారీ ప్రపంచమంతా కొలది సామ్రాజ్యవాద రాజ్యాల ఆధిపత్యంలో వుందని అనేవాళ్ళం. నేడో ఫైనాన్సు పెట్టుబడి

విపరీతంగా పెరిగిన ఒకేఒక పెట్టుబడిదారీ రాజ్యం - అమెరికా - పెట్టుబడిదారీ ప్రపంచమంతటిపైనా కాస్తో - కూస్తో పెత్తనం చెలాయించుతోంది. నేడు ఫైనాన్సు పెట్టుబడి విపరీతంగా కేంద్రీకరించబడింది. యుద్ధకాలంలో అమెరికా ఉత్పత్తి నూటికి 50 వంతులు పెరిగింది. దానికి మార్కెటులు కావాలి; ముడిపదార్థాలు కావాలి. ప్రపంచమంతటిలోనూ పెట్టుబడి పెట్టడానికి అవకాశాలు కావాలి. అమెరికా గుత్తాధికార కంపెనీలు ప్రపంచ గుత్తవ్యాపారంలో ప్రముఖ పాత్ర వహించుతున్నాయి. అమెరికా పెట్టుబడి ప్రపంచమంతటా ప్రముఖస్థానాలు సంపాదించుతూంది. పెట్టుబడిదారీ దేశాలను - చిన్నవి పెద్దవికూడా- ఒకవిధంగా తనపై ఆధారపడేలాగ అమెరికా చేయగలుగుతూంది.

యుద్ధరంగంలో చావుబ్రదుకుల పోరాటం సాగుతున్న రోజులలో కూడ రెండుపక్షాల గుత్తవ్యాపారస్థుల మధ్య సన్నిహితసంబంధాలు ఉంటూనే వచ్చాయి. పెట్టుబడిదారీ దేశాల యుద్ధనీతిపైన వారికి పలుకుబడి వుంటూనే వచ్చింది. వారు యీ పలుకుబడిని నాజీవ్యతిరేకుల సత్వరవిజయానికి వినియోగించలేదు. మిత్రరాజ్యాల యుద్ధపరిశ్రమల శక్తిని పెంపొందకుండా ఆటంకాలు పెట్టారు. ఫైనాన్సు పెట్టుబడిదారులు విపరీతలాభాలు పొందారు. ప్రజాస్వామిక శక్తులను బలహీనపరచారు. యుద్ధకాలంలో పెట్టుబడిదారీ గుత్తవ్యాపార కంపెనీలు అనుసరించిన పాలసీ అందుకే దారితీసింది.

నేడు యీ గుత్తవ్యాపారసంస్థలు ఓడిపోయిన దేశాలను, గెలిచిన దేశాలను కూడ తమ ఆర్థికపెత్తనం క్రింద ఉంచుకోడానికి ప్రయత్నించుతున్నాయి. చిన్న దేశాలకు

పూర్వమున్న స్వాతంత్ర్యాన్నికూడ లేకుండా నాశనం చేస్తున్నాయి. పెట్టుబడిదారీ దేశాలలోని అభివృద్ధినిరోధక శక్తులతో సంబంధం పెట్టుకొంటున్నాయి. వాటిని అధికారంలోకి తేడానికి ప్రయత్నించుచున్నాయి. లేదా ఆప్రయత్నంలో అంతర్యుద్ధాలను రెచ్చగొడు న్నాయి. విద్రోహశక్తులు రాజకీయంగా దాడిచేయడానికి సహాయపడుతున్నాయి.

నేడు బ్రిటను, ఫ్రాన్సులాంటి దేశాలుకూడ ఆర్థికంగా కొంతవరకు అమెరికాపై ఆధారపడే స్థితికి వచ్చాయి. అమెరికా బ్రిటనుకు యిచ్చిన అప్పుకు పెట్టిన షరతులకు అసమ్మతి తెలుపుతూ బీవర్‌బ్రూక్ ప్రభువు సామ్రాజ్యం అతి చౌకగా అమ్మివేయ బడిందని ఆక్షేపించాడు. బ్రిటను పండించిన పంటను అమెరికా కోసుకు పోతూందని గోలపెట్టాడు.

ఎకనమిస్టు పత్రిక యిలావ్రాసింది:—బ్రిటను తన జాతీయ సంపత్తులో నాల్గవభాగం యుద్ధఫలితంగా గోల్పోయింది. అంతేకాదు; యుద్ధంలో లాభాలు గడించిన వారికి సంవత్సరానికి 350 లక్షల పౌన్లు రాబోవు 50 యేండ్లూ చెల్లించ వలసి వస్తూంది అని విచారపడింది.

కాని బ్రిటీషు ప్రజలు గోలపెడుతున్నది యీ 350 లక్షల పౌనుల అప్పును గురించిగాదు. అప్పుయిస్తూఅమెరికా పెట్టిన షరతులను గురించి వారు ఆందోళన చెందుతున్నారు. బ్రిటీషు సామ్రాజ్యంలో అన్నిభాగాలలోకి విస్తరించడానికి అమెరికా పెట్టుబడికి సంపూర్ణ స్వేచ్ఛ యివ్వబడినందుకు వారుగోలపెడుతున్నారు.

ఫ్రాన్సు పరిస్థితికూడా దాదాపు అలాగేవుంది. మిత్ర రాజ్యాలలో అయిదవ పెద్ద రాజ్యమయిన కొమింటాంగ్

చైనా వాస్తవంగా అమెరికాకు వలస రాజ్యాంగా తయారయింది. ముఖ్యంగా యీ మధ్య జరిగిన 'వర్తక నావిక మైత్రి' సంధి తరువాత చైనాలో అమెరికా పెట్టుబడికి సంపూర్ణ స్వేచ్ఛ లభించింది.

ఒక్కమాటలో చెప్పాలంటే—పెట్టుబడిదారీ ప్రపంచంలో అమెరికాగుత్త పెట్టుబడి దారులు ప్రముఖస్థానాన్ని సంపాదించారు. యుద్ధంలోనూ, తరువాతనూకూడ అమెరికాలోని చిన్నకంపెనీలు, మధ్యరకం కంపెనీలు దివాళా తీశాయి. గుత్తవ్యాపార సంస్థలు బలపడ్డాయి. ప్రపంచమంతటా ప్రతి దేశంలోనూ అమెరికా గుత్తవ్యాపార సంస్థలు స్థానం సంపాదించాయి. ఈ విపరీత కేంద్రీకరణవల్ల పెట్టుబడిదారీప్రపంచ పరిణామంలో చాల తీవ్రమైన ఫలితాలు కలుగుతాయి. చరిత్రలో కనివిని యెరుగని బ్రహ్మాండమైన ఆర్థిక కేంద్రీకరణ మనకండ్లయెదుట జరుగుతోంది. ఓడిపోయిన దేశాల ఆర్థిక జీవితంలో అమెరికా ఫైనాన్సు పెట్టుబడి ప్రముఖస్థానం సంపాదించింది. అంతేకాదు. దక్షిణఅమెరికా, ఫిలిప్పైన్సు, చైనా వగైరాలను ఆర్థికంగా బానిసలుగా చేసుకుంది. స్వతంత్ర పెట్టుబడిదారీ దేశాలలోకూడ ప్రవేశించింది. బ్రిటీషు, ఫ్రెంచి వలస దేశాలలోనూ, డొమీనియన్లలోనూ, స్థానం సంపాదించింది. బ్రిటీషు డొమీనియన్లు అన్నీ ముఖ్యంగా కెనడా నేడు బ్రిటనుపైకంటే అమెరికాపై ఎక్కువగా ఆధారపడివున్నవి. అంతేగాకుండా యుద్ధకాలంలో అమెరికా పెట్టుబడికి భాగంయిచ్చి డొమీనియన్లు బలమైన పరిశ్రమలను నిర్మించాయి. ప్రపంచ మార్కెట్టులో యీడొమీనియన్లే బ్రిటనుతో పోటీచేస్తున్నాయి. డొమీనియన్లలో లాగానే

అమెరికా పెట్టుబడిదారులు ఉత్తరాఫ్రికాలోనూ, మధ్య ప్రాచ్యంలోనూ, ఇండియాలోనూ, కొరియాలోనూ, ఆర్థిక స్థానం సంపాదించారు.

ఇలాంటి ఆర్థిక విస్తరణవల్ల తక్కిన పెట్టుబడిదారీ దేశాల ఆర్థిక, రాజకీయ ప్రతిపత్తి బలహీన పడుతుంది. వాటికి తమసరుకును అమ్ముకునే మార్కెట్లు పోతాయి. ముడి పదార్థాలు సప్లయిచేసే దేశాలు పోతాయి. పెట్టుబడిని ఎగుమతిచేసి దోచుకునే అవకాశాలు లభించవు. తక్కిన అన్ని వలసవిధానాల వలెనే అమెరికా ఆర్థిక విస్తరణవల్ల ఆయా దేశాల ఆర్థికాభివృద్ధి కుంటుపడుతుంది. వాటిని రాజకీయంగానూ, ఆర్థికంగానూ బానిసత్వంలో వుంచుతుంది. ఆర్థికంగా అమెరికాపై ఆధారపడివుండే దేశాలను దోచుకోడంవల్ల యీ పని తప్పనిసరిగా జరుగుతుంది. 'ప్రపంచ ఆర్థిక విధానం' అనే సోవియట్ పత్రిక ఒక చిలీదేశ రచయిత వాక్యాలను యిలా ఉదహరించింది:

"చిలీదేశంలో వుత్పత్తిఅయ్యే రాగిలో నూటికి 95 పాళ్ళు అమెరికా కంపెనీలకు చెందుతుంది. ఉత్పత్తిఅయ్యే 'నైట్రేటు' (ఎరువు)లో నూటికి 60 పాళ్ళు అమెరికా కంట్రోలుచేసే కంపెనీలకు పోతుంది. 'నైట్రేటు' అమ్మకం వల్ల వచ్చే ప్రతి డాలరులోనూ అప్పులకు వడ్డీ చెల్లించడానికి గాని, భాగస్తులకు చెల్లించడానికిగాని, రవాణా ఖర్చులు యిచ్చుకోవడంవల్లగాని, ఇన్సూరెన్సు వాయిదాలు - ఏజెంట్ల కమీషను చెల్లించడానికిగాని మొత్తం 85 సెంట్లు అమెరికాలోనే వుండిపోతుంది."

అమెరికా ఫైనాన్సు పెట్టుబడిఅనే డాలరు రాక్షసుని కబంధ హస్తాలు పెట్టుబడిదారీ ప్రపంచాన్నంతనూ ఆవ రించాయి. విపరీతమైన లాభాలను పిండుతున్నాయి. ఫైనాన్సు పెట్టుబడి కేంద్రీకరణ త్వరత్వరగా ఉరుకులు పరుగులు వేస్తూ జరిగిపోతూంది. అమెరికా ఫైనాన్సు పెట్టుబడి ఆర్థిక విస్త రణను అనుసరించేదానికి అనుగుణ్యమైన రాజకీయ చర్యలు కూడా జరుగుతాయి. ఆమెరికా పత్రికలలో నేడు వివిధ రకాల రాజకీయ వాదనలు ప్రచారం చేయబడుతున్నాయి. నాజీజర్మనీ ఆర్యుల గొప్పతనాన్ని గురించి ప్రచారం చేసినట్లు గానే ఇపుడు ప్రపంచానికి అమెరికా ఆధిపత్యావుసరాన్ని గురించి ప్రచారం జరుగుతోంది. హిట్లరు ప్రపంచాధి పత్యంకోసం ప్రయత్నించి విఫలుడయ్యాడు. అమెరికా బ్యాంకులు, ట్రస్టులు అదే ఆశయంకొరకు, కనీసం పెట్టుబడిదారీ ప్రపంచంపై ఆధిపత్యంకొరకు విశ్వప్రయత్నాలు చేస్తు న్నాయి.

2. బ్రిటను - ఫ్రాన్సుల అవస్థలు

అయితే బ్రిటను తన ప్రత్యేకతను పూర్తిగా కోల్పోయిందనుకోవడం పొరపాటు అవుతుంది. బ్రిటిష్ పెట్టుబడిదారీ వర్గాలు తమ సామ్రాజ్యాన్ని రక్షించుకోడానికి, పునరుద్ధరించుకోడానికి తీవ్రప్రయత్నాలు చేస్తున్నాయి. అమెరికా పెట్టుబడి విస్తరించడంవల్ల బ్రిటిష్ వలసరాజ్యం కూలిపోకుండా కాపాడుకోడానికి, తమ మార్కెట్టులను, ముడిపదార్థాల కేంద్రాలను, తమ వలసరాజ్యాలను అమెరికా కాజేయకుండా రక్షించుకోవాలని బ్రిటను కృషిచేస్తూంది. వివిధ రాజకీయ చర్యలద్వారా వాటిని కాపాడుకోవాలని చూస్తూంది. ఆ ప్రయత్నాలలో ఒకటి పశ్చిమరాజ్యాల కూటమిని (వెస్టరన్ బ్లాకును) నిర్మించుట. ఈ కారణాలన్నిటివల్లా ప్రపంచమంతటా యెల్లప్పుడూ మనకు ఆంగ్లో - అమెరికన్ వైరుధ్యాలు కన్పించుతాయి.

కాని యివి త్వరగా పెంపొందుతున్న ప్రధాన మార్పును, ప్రవాహాన్ని అరికట్టలేవు. యుద్ధకాలంలో బ్రిటనులో కొద్దిగా ఉత్పత్తి పెరిగింది. అమెరికాతో పోల్చిచూస్తే బ్రిటను చాలా దారిద్ర్యమనుభవించింది. ఋణదాత స్థితిని గోల్పోయి బ్రిటను ఋణగ్రస్తురాలయింది. ఉదాహరణకు ఇండియావంటి తన వలసదేశాలకే బాకీపడింది. విదేశాలలోని బ్రిటిష్ పెట్టుబడులు తగ్గిపోయాయి. అమెరికానుంచి అప్పుసంపాదించడానికి బ్రిటను అంగీకరించిన షరతులు బ్రిటనును నిరాయుధురాలిని చేశాయి. అందుచేత అమెరికా

ఆర్థికవిస్తరణకు వ్యతిరేకంగా బ్రిటను ఎక్కువగా పోరాడ లేదు. ఈ పరిస్థితులలో బ్రిటీషు ఉత్పత్తి అంతకంటే చాల ఉన్నత స్థాయిలో వున్న అమెరికా ఉత్పత్తితో పోటీ చేయ లేదు.

ఈ విషయంలో ఫ్రాన్సుస్థితి మరింత అధ్వాన్నంగా వుంది. దాని ఆర్థికస్థానాన్ని అమెరికా పెట్టుబడే గాకుండా బ్రిటీషు పెట్టుబడి కూడా ఆక్రమించుతూంది. తన సామ్రా జ్యంలో తాను పొందుతున్న నష్టాలను బ్రిటను యీవిధంగా కొంత తీర్చుకోవాలని ప్రయత్నించుతూంది.

అందుచేత ప్రస్తుతపరిస్థితులలో బ్రిటనుగాని ఫ్రాన్సు గాని అమెరికా ఫైనాన్సు పెట్టుబడి, దాని ఆర్థిక పెత్తనం పెట్టు బడిదారీ ప్రపంచంపైన స్థాపించుకోడాన్ని అరికట్టలేవు. రాజ కీయ సాధనలద్వారా అరికట్టగలుగుతాయా? అనేప్రశ్నకు భవిష్యత్తే సమాధానం యివ్వవలసివుంది. ఏమైనా యీ వైరుధ్యాలు పెట్టుబడిదారీ విధానానికి రానున్న మహాసంక్షో భంలో మరింత కల్లోలం కలుగజేస్తాయి.

3. రాబోవు ఆర్థిక సంక్షోభం - పెట్టుబడిదారీ ప్రపంచం భీతి

ప్రస్తుతం ఒకవిషయం గుర్తుంచుకోవాలి. పెట్టుబడిదారీ ప్రపంచాన్ని నేడు కల్లోలపరుస్తున్నది ఆర్థికవైరుధ్యాలు,వైషమ్యాలు మాత్రమేగాదు.

యుద్ధానికి పూర్వంతో పోల్చిచూస్తే అమెరికా పారిశ్రామికోత్పత్తి కనీసం నూటికి 50 పాళ్లు విస్తరించిందని యిదివరకే తెలియజేశాము. బ్రిటను ఉత్పత్తికూడా పెరిగింది. అదే సమయాన కెనడాలోను, ఆస్ట్రేలియాలోను, దక్షిణాఫ్రికాలోను - ఆ దేశాలు యుద్ధరంగాలకు దూరంగా వుండటంవల్ల - ఉత్పత్తి బ్రహ్మాండంగా పెరిగింది. పరిశ్రమలు కూడా కొన్నిశాఖలలో తగినంత పెరిగాయి. దక్షిణ, అమెరికా దేశాలలోనూ, ఇండియా-కొరియాలాంటి వలస దేశాలలోకూడా కొన్ని శాఖలలో ఉత్పత్తి పెరిగింది. తటస్థ దేశాలైన స్విట్జర్లాండు, స్వీడనులాంటి వాటిల్లో పరిశ్రమలు తగినంతగా పెంపొందాయి. దీనంతటి అర్థం ఏమిటంటే మార్కెట్టులకోసం కీచులాట యిదివరకుకంటేకూడ తీవ్రంగా వుంటుంది.

అదే సమయాన జర్మనీ ఆక్రమణ క్రిందవున్న యూరపు దేశాలన్నింటిలోనూ పారిశ్రామికశక్తి తగ్గిపోయింది. అయితే జర్మనీ ఆక్రమిత యూరపుదేశాలు యుద్ధఫలితంగా దారిద్ర్యం అనుభవించుతున్నాయి. కాబట్టి వాటికి

అవుసరాలున్నా, విదేశ పెట్టుబడిదారులకు అవి భాగ్యవంత మైన మార్కెట్టులుగా ఉపయోగపడవు. అంతేగాక ఈ దేశాలలో పరిశ్రమలను పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి. వాటిలో కొన్ని దేశాలు తమ కష్టాలను సాకుగా తీసికొని విదేశ పెట్టుబడి ప్రవేశించి తమ్ము బానిస లుగా చేయడానికి అంగీకరించడం లేదు. తమంతట తామే పారిశ్రామికాభివృద్ధికి కృషిచేస్తున్నాయి. ముఖ్యంగా తూర్పు ఆగ్నేయ యూరపులోని దేశాలు యీ విధానాన్నే అనుసరించుతున్నాయి. అవి సామ్రాజ్యవాద సంకెళ్ళు తెంచుకొని స్వాతంత్ర్యం పొందాయి.

ఇదంతాచూస్తే పెట్టుబడిదారీ ప్రపంచం తాను పరి ష్కారం చేయలేని అనేక సమస్యలను ఎదుర్కోవలసి వస్తూంది. పూర్వపు సంక్షోభాలను మించిన ఆర్థిక సంక్షోభం రాబో తూంది. ఆర్థికదుస్థితి భీతి పెట్టుబడిదారీ ప్రపంచాన్నంతటినీ కలతపెడుతూంది. ఈ భీతివల్ల అమెరికా, కెనడాలలో యుద్ధ కాలంలో నిర్మించిన ఫ్యాక్టరీలను తామే నిర్మూలనం చేస్తు న్నారు. వీటన్నిటినీ శాంతికాలంలో పనికివచ్చే వస్తూత్పత్తికి వినియోగించుకోవచ్చు. ఈ భీతివల్లనే పెట్టుబడిదారీ దేశాలు టెక్నికల్ నైపుణ్యాన్ని కుంటుపరుస్తున్నాయి. టెక్నిక్ను, సైన్సును అరికట్టడానికి ప్లానులు వేసే పెట్టుబడిదారీ ఆర్థిక వేత్తలు బయలుదేరుతున్నారు. అధికోత్పత్తి జరుగకుం డానూ, ఆర్థిక సంక్షోభం రాకుండానూ ఆపుచేయడానికి ప్లానులు వేస్తున్నారు. పెట్టుబడిదారీ విధానాన్ని తాత్కాలి కంగానైనా కుదట పరచడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. పెట్టుబడిదారీ ప్రపంచంలోని శాస్త్రీయపరిశోధనలు, పేటెం

టాలు, టెక్నికల్ అభివృద్ధి ప్లానులు అన్నీ గుత్తవ్యాపార కంపెనీల చేతులో వున్నాయి. అందుచేత వారు వాటిని దాచివేయవచ్చు. ఉదహరణకు యుద్ధకాలంలో అమెరికన్ ట్రస్టులు ఈ విధంగా కొన్ని ప్లానులను దాచి యుద్ధపరిశ్రమల పెంపుదలకు ఆటంకాలు కలిగించారు. నాజీ వేగులవాళ్లు యీ అవకాశాన్ని చక్కగా వినియోగించుకున్నారు.

సామ్రాజ్యవాదం పెట్టుబడిదారీ వినాశానికి అంతిమ దశ, దాని శిథిలావస్థకు చిహ్నమని యింతస్పష్టంగా ఎన్నడూ రుజువుకాలేదు. అణుశక్తి ఉపయోగాన్ని గురించి జరుగుతున్న చర్చలను ఒకసారి పరిశీలించండి. మానవుని శాస్త్రీయ పరిశోధనలలో - యీ మధ్య జరిగినవాటిలోకల్లా - ఆటంశక్తి గొప్ప విజయమనుట వాస్తవం. మానవ సమాజాభివృద్ధికి మహత్తర ఫలితాలను సమకూర్చుతుందనే మాట నిజం. ఆటంశక్తిని పారిశ్రామికంగా వినియోగించితే కష్టజీవులైన ప్రజల క్షేమానికి ఎంతో తోడ్పడుతుంది. ఈ పరిశోధన ప్రభావంవల్ల మానవసమాజం సోషలిజంవైపు అనుగమించి తీరాలనే విషయం కూడ స్పష్టపడుతుంది. ఏమంటే సోషలిస్టు సమాజంలోనే ఆటంశక్తి పరిపూర్ణంగా వినియోగించుకొనటం సాధ్యమవుతుంది.

అందుచేతనే అభివృద్ధి నిరోధక వర్గాలు 'అటంబాంబు' రహస్యాన్ని ప్రకటించడానికి అభ్యంతరాలు చెబుతున్నారు. అటంబాంబు రహస్యాన్ని మిలిటరీ రహస్యంగా దాస్తున్నామ. వారు చెప్పేది సాకేగాని నిజమైన కారణంకాదు. ఏమంటే ఆ రహస్యం ఎంతోకాలం ఒక దేశం ముల్లెగా వుండటము సంభవంకాదు. అంతకంటే ముఖ్యమైన కారణం

యింకొకటి వుంది. ఆటంశక్తిని పారిశ్రామికంగా వినియోగించితే పెట్టుబడిదారీ విధానానికి రానున్న సంక్షోభం మరింత తీవ్రరూపం దాలుస్తుందని ఫైనాన్సు పెట్టుబడిదార్లు భయపడుతున్నారు. ప్రపంచంలో సోషలిస్టు విజయానికి దారితీస్తుందని వారు భీతిచెందుతున్నారు. అందుచేత మానవ సమాజానికి గొప్పగా ఉపయోగపడే ఆటంశక్తి కొంత కాలంవరకు అమెరికా ఫైనాన్షియల్ పెట్టుబడిదారుల చేతులలో ఖైదీగా వుండిపోతూవుంది. దానిని వినియోగించితే కార్మికుని శ్రమలో కొంతభాగం తగ్గిపోతుంది. ఇలా ఎంతో కాలం ఆటంశక్తి ఖైదీగా వుండదు. కాని ప్రస్తుతదశలో సామ్రాజ్యవాదంయొక్క స్వభావాన్ని అర్థంచేసుకోవడానికి యీ ఉదాహరణ వినియోగించుతుంది. సోషలిజం విజయం పొందడాన్ని పెట్టుబడిదారీ విద్రోహశక్తులు పూర్తిగా ఆపు చేయలేవు. కాని సైన్సు, టెక్నిక్ అభివృద్ధి చెందకుండా ఆటంకాలు పెడుతూ, రాజకీయంగా కుట్రలు పన్నుతూ సోషలిజం ముందంజ వేయకుండా జాగుచేస్తున్నారు.

ఫాసిజం విషబీజాలు

సామ్రాజ్యవాదంయొక్క ప్రస్తుత దశకు స్వాభావికమైన అనేక వైరుధ్యాలను పెట్టుబడిదారీ విధానం పరిష్కరించలేదు. దానికి ఆర్థిక పరిష్కారమార్గాలు లేవు. అందుచేత రాజకీయమార్గమొక్కటే దానికి మిగిలియుంది. మానోపలీ (గుత్తాధికారం) పెట్టుబడిదారీ విధానంయొక్క రాజకీయ సాధన విద్రోహశక్తులను బలపరచడం, నూతన ఫాసిస్టుఅంకురాలను సృష్టించడమే. సామ్రాజ్యవాదం విద్రోహాన్ని, ఫాసిజాన్ని ప్రతిరోజూ ఉత్పత్తి చేస్తుంది. ఎడతెగకుండా

ఉత్పత్తి చేస్తుంది. స్వాతంత్ర్యాభిలాషులు యీ సత్యాన్ని ఒక నిమిషం కూడా మరచిపోకూడదు.

ఈ సందర్భంలో నేనొక విషయాన్ని మీ దృష్టికి తెస్తున్నాను. ఫాసిస్టు నియంతృత్వం యొక్క ప్రధాన లక్షణం ఏమిటంటే ఫైనాన్షియల్ పెట్టుబడిదారీ నాయకులు. ప్రభుత్వనాయకులు ఒండొరులలో లీనమైపోయి వుంటారు. ఫాసిస్టు నియంతృత్వమంటే, ఫైనాన్సు పెట్టుబడియొక్క ప్రత్యక్షపెత్తనం. పెట్టుబడిదారీ విధానంయొక్క స్వేచ్ఛా పోటీ దశకు చిహ్నంగా బూర్జువా డిమాక్రటిక్ పార్లమెంటు వుండేది. పెట్టుబడి-ఉత్పత్తి కొలదిమంది చేతుల్లో కేంద్రీకరించబడిన మోనాపలీ కేపిటలిజం (గుత్తాధికార) దశలో రాజకీయాధికారం కూడ ఆకొలదిమంది చేతుల్లోనే కేంద్రీకరించబడుతుంది. అందుచేతనే ఫాసిస్టులు ఆర్థిక ప్లానును (planned economy) గురించి సాధారణంగా మాట్లాడుతూంటారు. అంటే దేశంయొక్క యావత్తు ఆర్థిక జీవితాన్ని కొలదిమంది పెట్టుబడిదారీ మానోపలీల శ్రేయస్సుకు అనుకూలంగా నడపాలని వారి ఆశయం. ప్రభుత్వ గొప్పతనం తెలిపే నినాదాల అర్థం ప్రజలశక్తులన్నిటినీ ఫైనాన్సుపెట్టుబడి విస్తరించడానికి, సామ్రాజ్యవాదుల దురాక్రమణకు వినియోగించాలనే, హిట్లరు 'జర్మన్ సోషలిజాన్ని' గురించి కూడ మాట్లాడేవాడు. అతగాడి 'జర్మన్ సోషలిజం' అంటే అచరణలో ఏమిటో నేడు ప్రతివారికీ తెలుసు. ఫైనాన్సు పెట్టుబడిదారుల సర్వాధికారంపై ఆధారపడిన - సామ్రాజ్యవాదుల ముఠాయొక్క - నియంతృత్వమని అందరికీ తెలుసు.

అయితే ఫాసిజం తనదేశంలోని ప్రజలను బానిసత్వంలో వుంచడంతో సంతృప్తిచెందదు. తనదేశం దానికి చాలా యిరుకుగా కన్పిస్తుంది. మోనాపలీ, విస్తరణ రెండూ ఫైనాన్సు పెట్టుబడికి సహజలక్షణాలు. వాటిని విడదీయడానికి వీలులేదు. మార్కెట్లపైన, ముడిపదార్థాల పైన, ఉత్పత్తిపైన పెత్తనం సంపాదించడానికి మోనాపలీలు కృషిచేస్తాయి. ప్రపంచంపైన ఆర్థిక-రాజకీయ పెత్తనంకొరకు ప్రయత్నం చేస్తాయి. అందుకొరకే ఇతర దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యంకలిగించుకుంటాయి. విదేశ ప్రభుత్వాలకు లంచాలు పెడతాయి. విద్రోహక ముఠాల నియంతృత్వాన్ని స్థాపించడానికి,బలపరచడానికికృషిచేస్తాయి. ఆయా దేశాలలోని ప్రజాస్వామిక సంస్థలను నాశనంచేస్తాయి. వాటిని మోనాపలీల పలుకుబడిలోకి, ఆర్థిక బానిసత్వంలోకి తేడానికి ప్రయత్నించుతాయి. పోరాటాలకు, యుద్ధాలకు సన్నాహాలు చేస్తాయి. అందుచేత పెద్ద పెద్ద పెట్టుబడిదారీ దేశాలలో ప్రజా స్వామిక శక్తులు తీవ్రంగా పోరాడకపోతే మానొపలి పరిపాలన దురాక్రమణకు దారి తీస్తుంది. ప్రజా స్వామిక హక్కులన్నీ రద్దు చేయబడుతాయి. ఆ దేశాలలో ఫాసిస్టు ప్రభుత్వ స్థాపనకు దారి తీస్తాయి.వాటి పలుకుబడిలో వున్న దేశాలలో అంతకుముందే మరింత తీవ్రతతో నిరంకుశ పరిపాలన స్థాపించబడుతుంది.

అలాగే జర్మనీలో ఫాసిస్టు నియంతృత్వం స్థాపించబడినసంగతి మనందరికీ తెలుసు.ఆ నియంతృత్వాన్ని నాశనం చేశాము. కాని అలాంటి నియంతృత్వం పుట్టుకకు మూల

కారణమైన పెట్టుబడిదారీ మానోపలీలు నాశనం చేయబడ్డాయా? అనే ప్రశ్న మనందరినీ ఎదుర్కొంటూంది.

అలా చేయగలిగామనుకోడం నిజంగా పిచ్చిభ్రమ తప్ప మరేమీకాదు. పెద్ద పెట్టుబడిదారీ దేశాలన్నిటిలోనూ మానోపలీల శక్తి మరింత యినుమడించిందనే సంగతి అందరికీ తెలిసిన విషయమే. ఇదివరకు ఎన్నడూ లేనంతగా వివిధ దేశాల మానోపలీలమధ్య అంతర్జాతీయంగా నేడు సన్నిహిత సంబంధాలు ఏర్పడ్డాయనే సంగతికూడ అందరికీ తెలిసిందే. అమెరికన్ మానోపలీ సంస్థలు యూరప్‌లోనూ, ప్రపంచంలోనూ వున్న అనేక సంస్థలను గుత్తాకాయస్వాహా చేశాయి. ప్రపంచంలో యితర భాగాలలోవున్న పోటీసంస్థలను మ్రింగడానికి విశ్వప్రయత్నం చేస్తున్నాయి.

నేను సాదృశ్యాలు చెప్పడానికి ప్రయత్నించను. అమెరికా ప్రభుత్వ పాలసీని నిర్ణయించేవారికి శక్తివంతమైన అమెరికా మానోపలీలతో సంబంధము లేదని ఎవరైనా చెప్పగలరా? అమెరికా ప్రభుత్వపాలసీపైన యీ మానోపలీలకు ఎక్కువ పలుకుబడివుందనే సత్యాన్ని గురించి ఎవరికీ అనుమానం లేదుగదా! అమెరికాలోని ప్రజాస్వామిక శక్తులు యింకా చాలా బలహీనంగా వున్నాయి. అందుచేత వినాశకరమైన మానోపలీల పలుకుబడిని అరికట్టలేకపోతున్నాయి. కాబట్టే అమెరికా సామ్రాజ్యవాదులు విచ్చలవిడిగా సంచరించగలుగుతున్నారు.

అమెరికాలో కొన్నివర్గాలు ప్రస్తుతం అనుసరించుతున్న దురాక్రమణ పాలసీకి ప్రాతిపదిక యిదే. ఇతర దేశాల ఆంతరంగిక విషయాలలో జోక్యం కలిగించుకునే

పాలసీకి పునాది యిదే. ఆర్థిక చర్యలద్వారాను, రాజకీయ వత్తిడిద్వారానూ, ఆటంబాంబు బెదరింపులద్వారానూ వివిధ 'స్వతంత్ర దేశాల'లో విద్రోహశక్తులతో ప్రభుత్వాలను పునరుద్ధరించడానికి చేసే ప్రయత్నాలకు మూలం యిదే. ఫాసిస్టు అంకురాలకు పునర్జీవం పోయడానికి ప్రపంచమంతటా మిలిటరీ కేంద్రాలను నిర్మించడానికి ప్రాతిపదిక యిదే. ప్రజాస్వామిక హక్కులను, సంస్థలను రద్దు చేయడానికి జరిగే ప్రయత్నాలు దేశీయ రాజకీయాలలో పైవాటికి ప్రతిబింబాలే. మానోపలీల పలుకుబడిని, వినాశకరమైన ప్రభుత్వ పాలసీని ఎదిరించే వారందరినీ అణచివేయడానికి సాకుగా అమెరికా సామ్రాజ్యవాదులు కమ్యూనిస్టు వ్యతిరేకనినాదాలు లేవదీశారు.

ఈ మానోపలీలు ప్రజాసామాన్యానికి మిగిల్చే స్వాతంత్ర్యమల్లా ఒక్కటే. రాజకీయాంధకారంలో జీవించడానికి స్వేచ్ఛనిస్తారు. అలా ప్రజలు రాజకీయంగా వెనుకబడివున్నంతకాలం సామ్రాజ్యవాద ప్రచారకులు డెమాక్రసీని గురించి, చతుస్స్వాతంత్ర్యాలను గురించి ఉపన్యాసాలు దంచుతారు. కాని అంతర్గత వైరుధ్యాలు తీవ్రమయ్యేకొలదీ మానోపలీల పరిపాలనకు ప్రమాదం ఏర్పడేకొలదీ, ప్రజల రాజకీయచైతన్యం అభివృద్ధి చెందేకొలదీ యీ డెమాక్రసీ అంతర్ధానమవుతుంది. ఉదాహరణకు 'భీతినుంచి విముక్తి' అని నేడు కబుర్లుచెప్పడం వట్టిదగా. ఏమంటే అమెరికావంటి సామ్రాజ్యవాదదేశాలు అనుసరించుతున్న విదేశాంగపాలసీ కేవలం వత్తిడి, బెదరింపులతో కూడుకొనివుంది. వీటిలో ఆటంబాంబు, యుద్ధ బెదిరింపులు కూడ చేరివున్నాయి.

చరిత్రలోకల్లా పెద్ద పెట్టున సామ్రాజ్యవాద విస్తరణ జరుగుతోంది. కాని యిదంతా చిన్నస్వాతంత్ర్యాలకోసం, డెమాక్రసీ రక్షణకోసం. వర్తక స్వాతంత్ర్యం - ఆర్థిక సహకారంకోసం జరుపుతున్నామని అమెరికా సామ్రాజ్యవాదులు దగామాటలు చెబుతున్నారు.

అంతర్జాతీయంగా యీపనులవల్ల జరుగుతున్న ఫలితాలను గమనించితే చాలు. పెట్టుబడిదారీ మానోపలీలవల్ల ప్రపంచశాంతికి ఎంత ప్రమాదం వాటిల్లుతుందో బోధపడుతుంది. స్వాతంత్ర్యాభిలాషులైన ప్రజలు తీవ్రంగా ఎదిరించకపోతే డెమాక్రసీకే ప్రమాదం ఏర్పడనున్నదని స్పష్టపడుతుంది.

4. ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్యవాదుల వైరుధ్యాలు

పైన వర్ణించిన పరిస్థితులు కేవలం యుద్ధానంతరం వచ్చినవికావు. మ్యూనిక్ ద్రోహానికీ ప్రస్తుతం పెద్ద పెట్టుబడిదారీ దేశాలలోని కొన్నివర్గాలు అనుసరించుతున్న పాలసీలకూ ప్రత్యక్ష సంబంధముంది. అదే విధంగా రెండో ప్రపంచ యుద్ధకాలంలో ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదులు అనుసరించిన పాలసీతోకూడ సంబంధముంది.

రెండవ ప్రపంచయుద్ధం ప్రధానంగా ఫాసిస్టు వ్యతిరేకయుద్ధం, స్వాతంత్ర్యయుద్ధం అయినప్పటికీ యుద్ధకాలంలో ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదవర్గాలు అనుసరించిన పాలసీలను గమనించకపోవడం తప్పు అవుతుంది. యుద్ధగతి రెండు వైరుధ్యాలపై ఆధారపడి నడిచింది. ఒకవైపున పెట్టుబడిదారీ ప్రపంచంపైన ఆధిపత్యం సంపాదించడానికి పెట్టుబడిదారీ దేశాలమధ్య వున్న వైరుధ్యం వుంది. రెండోవైపున సోవియట్‌నాయకత్వాన పోరాడుతున్న డెమాక్రేటులు, సోషలిస్టులు, మొదలగుసామ్రాజ్య వ్యతిరేకశక్తులకు-పెట్టుబడిదారీ ప్రపంచానికీ మధ్యవున్న వైరుధ్యముంది. వీటిలో మొదటి వైరుధ్యం హెచ్చుగా యుద్ధం మొదటిదశలో ద్యోతకమయింది. యుద్ధం చివరిదశలో రెండో వైరుధ్యం ఎక్కువగా ద్యోతకమయింది,

యుద్ధం మొదటిదశలో బ్రిటను ప్రపంచంలో తనకున్న

అనేక మిలిటరీ కేంద్రాలను అమెరికాకు అర్పించింది. వలస రాజ్యాలలోకి, డొమినియన్లలోకి అమెరికా ఆర్థిక ప్రవేశాన్ని అరికట్టలేక పోయింది. యుద్ధకాలంలో బ్రిటనుపై అమెరికా నౌకా ప్రాధాన్యత సంపాదించింది. నావికా శక్తిలో బ్రిటను చాల వెనుకబడిపోయింది. అదే సమయాన అమెరికా ప్రపంచమంతటా సైనిక - నావికా కేంద్రాలను నిర్మించ సాగింది.

ఎన్ని వైరుధ్యాలు వున్నప్పటికీ బ్రిటను - అమెరికాలలోని సామ్రాజ్యవాదవర్గాలకు ఒక విషయంలో పూర్తి ఏకాభిప్రాయం వుంది. సోవియట్ యూనియన్‌తో సంబంధాల విషయంలోనూ, సామ్రాజ్యవ్యతిరేక ఉద్యమాల విషయంలోనూ, వీరి దృక్పథం ఒకటే.

సోవియట్‌పై సామ్రాజ్యవాదుల ఈర్ష్య

ఇచట నేను, యుద్ధకాలంలో సోవియట్ ఎడల పశ్చిమ రాజ్యాలు అనుసరించిన పాలసీని చర్చించను. ఏమంటే ఆ విషయం అందరికీ తెలుసు. ఆ విషయంలో బ్రిటీషు రచయితల అభిప్రాయాలను మాత్రమే యిచట చెబుతాను. ఉదాహరణకు పామీదత్తు యిలా వ్రాశాడు:

"యుద్ధకాలంలో బ్రిటీషు సామ్రాజ్యవాదం రెండు ముఖాలుగా నడిచింది. అధికారంలో వున్నవాళ్ళ మాటల్లో యీ విషయం కొంతగుట్టుగా వుంచేవారు. అనధికారులు మాట్లాడేటప్పుడు యీ విషయం ప్రత్యక్షంగా కన్పించేవి. యుద్ధ నిర్వహణలోనూ, ఆంగ్లో - అమెరికన్ రాజకీయ సంప్రదింపులలోనూ స్పష్టంగా కన్పించేది. ఒకవైపున పశ్చిమ సామ్రాజ్యవాదులు హిట్లరును ఓడించడానికి సోవియట్

యూనియన్‌తో ఒడంబడిక చేసుకున్నారు. రెండో వైపున ఫాసిజం పతనంతోపాటు కమ్యూనిజం ముందడుగు వేయకూడదు; యూరపులో ఫాసిష్టు వ్యతిరేక ప్రజా విప్లవాలు రాకూడదు; పాత సామాజిక విధానం కూలిపోకూడదు; సోవియట్ యూనియన్ బలపడకూడదు. యుద్ధగతిలో హిట్లరు నాశనం కావడంతోపాటు సోవియట్‌కూడ నాశనమవ్వాలని, లేదా కోలుకోలేనంత బలహీన పడాలని, వారు అంచనా వేసుకున్నారు. ఆంగ్లో-అమెరికన్ సామ్రాజ్య వాదులు ప్రధాన విజేతలుగా బయటపడి యూరపును అణచి పట్టి వుంచాలనీ, ప్రపంచాన్ని కంట్రోలు చేయాలనీ వారు ఆశించారు."

పామీదత్తు యింకా యిలా వ్రాశారు:—

"పడమటినుంచి రెండో రంగం తెరవాలని కమ్యూనిస్టులు చేసిన ఆందోళనను అధికారులు ఆక్షేపించేవారు. మిలిటరీ నిపుణులకు మాత్రమే తెలసిన విషయాలలో అనవసరంగా వేలుపెడుతున్నామని నిందించేవారు. ఈడబ్బాగాళ్ళు కెప్టెన్ బుచర్ (జనరల్ ఐసన్‌హోవర్ కార్యదర్శి) వ్రాసిన మెమొయర్సు (చారిత్రక విషయాలు) చదివితే తెల్లమొఖం వేయవలసివస్తుంది. జనరలు ఐసన్‌హొవర్, అతని మిలిటరీ నిపుణులూ 1942 వేసవిలోనే యూరపులో రెండో రంగం తెరవాలని కోరారు. కాని దీనికి రాజకీయ నాయకులే అడ్డుపడ్డారు. ఆరోజుల్లో తెలియకపోయినా, రెండో రంగం తెరువకుండా ఆలస్యం చేయడానికి ముఖ్యకారకుడు చర్చిలు అని తేలిపోయింది. 1942 లో రెండోరంగం తెరువరాదని చర్చిలు నిర్ణయం తెలుపబడినపుడు జనరలు ఐసన్

హాోవసు 'యుద్ధమంతటికీ విషాదకరమైన దినమని' అన్నాడు. ఈ 'నిర్ణయం యుద్ధాన్ని పొడిగించుతుందని' చెప్పాడు."

ఈనిర్ణయం నిజంగా యుద్ధాన్ని పొడిగించింది. "మన సైన్యాలు" అనే పుస్తకంలో జనరల్ మార్టెల్ యిలా వ్రాశాడు:—

"ఒక యేడాదికి పూర్వమే ఇంగ్లాండులో మన సైన్యాలు సిద్ధంగా వున్నాయి. 1944 నాటికి సోమరిగా కూర్చుని బింకం చేస్తున్నాయికూడా. మన ప్లాను ఇంకా ముందుగా నిర్ణయించుకున్నట్లయితే యింకా ముందుగానే తయారుగా వుండగలిగే వారమే!"

ఇలాంటి ఉదహారణలు ఎన్నైనా యివ్వవచ్చు. రెండోరంగాన్ని ఆలస్యం చేయడాన్ని గురించి ప్రజలేమనుకున్నారో చూపడానికి పైవి తెలిపాను. యుద్ధకాలపు రాజకీయాల ధోరణి తెలుపడానికి యితర ఉదాహారణలుకూడ అనేకం యివ్వవచ్చు. కాని యివన్నీ రెండో ప్రపంచ సంగ్రామం స్వాతంత్ర్యయుద్ధం అనే ప్రధాన సూత్రాన్ని మార్పుచేయజాలవు. కాని ఆంగ్లో - అమెరికన్ సామ్రాజ్యవాదులు అనుసరించిన పాలసీ మిత్రరాజ్యాలమధ్య పరస్పర విశ్వాసం కలుగజేయదు అనేమాట మాత్రం సత్యం.

సోవియట్ యూనియన్ యెడల యూరపులోని జాతీయ స్వాతంత్ర్య వుద్యమాల యెడల సామ్రాజ్యవాదులు అనుసరించుతున్న విరోధపాలసీలనుసమర్థించుతున్న కొందరు వితండవాదులు 'సోవియట్ సామ్రాజ్య విస్తరణనుంచి' రక్షణకొరకే బ్రిటను-అమెరికాలు అలా చేస్తున్నాయని వాదించుతున్నారు. రెండు ఆదర్శాలమధ్య ఘర్షణగా, పశ్చిమ డెమా

క్రసీకీ - తూర్పు నియంతృత్వానికీ మధ్య తగవుగా చిత్రించు తున్నారు. వాస్తవంలో సోవియట్ నుంచి రక్షణ అవసరమే లేదు. ఏమంటే సోవియట్ యూనియను హిట్లరుముఠాను తప్ప ఏ దేశాన్నీ బెదరించలేదు. బ్రిటీషు - అమెరికన్ ఫైనాన్సు పెట్టుబడిదారులే ఆక్రమిత యూరపు శిథిలాలలో తిష్ఠవేసూలని ప్రయత్నించుతున్నారు. వారి విస్తరణ కార్య క్రమానికి జాతీయ స్వాతంత్ర్య వుద్యమాలు, సోవియట్ యూనియనూ సహజంగా అభ్యంతర పెడుతున్నాయి. ఈ పాలసీ ఫైనాన్సు పెట్టుబడిదారులకు గిట్టలేదు. వారి దృష్టిలో నాజీలపతనం ప్రజాస్వామికశక్తుల స్వాతంత్ర్యపోరాటానికి దారి తీయకూడదు. తమ ప్రపంచాధిపత్యానికి మెట్టుగా మాత్రమే వుండాలి.

గత యుద్ధకాలంలో రాజకీయ కారణాలు ఎంత ముఖ్యపాత్ర వహించాయో చరిత్రను తరచి చూచినవారికి పూర్తిగా బోధపడుతుంది. యుద్ధగతి నిర్ణయించడంలో యీ రాజకీయ కారణాలే ప్రముఖపాత్ర వహించాయనడం కూడ ఖాయం. ఫాసిస్టుశక్తులకు వ్యతిరేకంగా ప్రజాస్వామిక ప్రపంచం ధర్మయుద్ధం చేస్తూంటే విద్రోహవర్గాలు తమ సామ్రాజ్యవాద ఆశయాలను సాధించడంకోసం కృషి చేశాయి.

ప్రజాస్వామికశక్తులపై దాడి

యుద్ధానంతర ప్రపంచ రాజకీయాలలో కన్పించు తున్న వైరుధ్యాలను కూడ యీ దృక్పథాన్నుంచే అర్థం చేసుకోవాలి. ఫాసిస్టుదేశాలలోనూ, ఇతర దేశాలలోనూ కూడ ఆర్థిక - రాజకీయ పెత్తసంకోసం తహతహలాడు

తున్న అమెరికన్-బ్రిటిషు ఫైనాన్సు పెట్టుబడిదారులు ఆయా దేశాలలోని విద్రోహశక్తులను బలపరుస్తున్నారు. తమ ప్రభుత్వాల పాలసీని ఫాసిస్టు అంకురాలను రక్షించేలాగా నడుపుతున్నారు. యుద్ధనేరస్థులను దాస్తున్నారు. వివిధదేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యం కలుగజేసుకుంటున్నారు. ప్రజా వ్యతిరేక చర్యలకు, సోవియట్ వ్యతిరేక నిందలకు దిగుతున్నారు. ప్రపంచంలో అభ్యుదయకరమైన అన్ని ప్రజాస్వామిక ఉద్యమాలపైన అమెరికాలోని విద్రోహశక్తులు దాడి వెడలడంలో అంతరార్థమిదే. ప్రపంచంలో వివిధ ప్రాంతాలలోని ప్రజాస్వామికోద్యమాలను - పక్షాలను అణచివేయడానికి పోలీసువాడిగా తమ దేశాన్ని తయారుచేయడానికి బ్రిటనులోని సామ్రాజ్యవాదశక్తులు కృషి చేయడానికి కారణమిదే. దీనివల్ల అమెరికాపై ఆధారపడవలసివచ్చిన బ్రిటను 'పెద్దం పెట్టేవాడి తమ్ముడిపాత్ర' వహించుతుందనేమాట ఖాయం.

ఆంగ్లో-అమెరికను వైరుధ్యాలు

చివరి కారణం బ్రిటను ఆంతరంగిక రాజకీయాలలో చాల ప్రాముఖ్యత వహించుతోంది. ప్రపంచం అన్నిభాగాలలోనూ అమెరికా-బ్రిటనులకు వైరుధ్యంవుంది. దానిని మనం తక్కువ అంచనా వేయరాదు. బ్రిటిషు సామ్రాజ్యంలో బ్రిటిష్ పెట్టుబడికున్న సౌకర్యాలను తానుకూడ పొందడానికి అమెరికా ఫైనాన్సు పెట్టుబడి ప్రయత్నించుతూంది. రెంటికీ సమానావకాశాలు యివ్వడమంటే ఆచరణలో బ్రిటనును వలసరాజ్యాలనుంచీ, సామ్రాజ్యాన్నుంచీ

బ_ర్తరఫ్ చేయడంతో సమానమే. ఆచరణలో బ్రిటిష్ సామ్రాజ్యాన్ని విచ్ఛిన్నం చేయడంవంటిదే.

జపానులోనూ, చైనాలోనూ, పసిఫిక్ రంగమంతటిలోనూ బ్రిటను పలుకుబడి దిగజారి పోతూంది. అరబ్బు దేశాలలోనూ మెడిటరేనియన్‌లోనూ అమెరికన్లు స్థిరమైన స్థానం సంపాదించారు. అమెరికా సామ్రాజ్యవాదాన్ని సమర్థించేవారు అపుడే 'మెడిటరేనియన్ దేశము' గా అమెరికా అయిపోతూందని చెబుతున్నారు. అంటే మధ్యధరా సముద్రం, సూయజ్ కాలువ, రహదారీ మార్గాలకు తాళపుచెవి యిక ఒక్క బ్రిటను చేతుల్లోనే వుండదు. ఆక్రమిత జర్మనీలోని బ్రిటిషు-అమెరికా భాగాలను కలుపుతామంటున్నారు. అంటే దీని అర్థం బ్రిటిషు జోనులోకి అమెరికా ఫైనాన్సు పెట్టుబడి, అమెరికా ట్రస్టులు ప్రవేశించుతాయన్నమాట.

ఇలాంటివి అనేక ఉదాహరణలు యివ్వవచ్చు. దీనికి తోడు బ్రిటనుకంటే అమెరికా బ్రహ్మాండమైన మిలిటరీబలం కలిగివుంది. ప్రపంచ సముద్రమార్గాలన్నిటిపైనా అమెరికా ఆధిక్యత ఏర్పడింది. పూర్వకాలపు నిర్వచనం ప్రకారం అమెరికాకు వలసరాజ్యాలులేవు. కాని ప్రపంచమంతటా కీలకస్థానాలలో అమెరికా మిలిటరీ కేంద్రాలను, నౌకాశ్రయాలను, విమానాశ్రయాలను నిర్మించింది. అనేక కేంద్రాలను బ్రిటనే అమెరికాకు 99 యేళ్ళు అద్దెకు యివ్వవలసి వచ్చింది. ఈ కేంద్రాల నిర్మాణమూ, ఆర్థిక - రాజకీయ వత్తిడీ, పూర్వపు వలసరాజ్య విధానంకంటే నేడు సామ్రాజ్యవాద విస్తరణకు ఎక్కువ అనుకూలంగా వుంటాయి.

వీటన్నిటికీ రాజకీయ ఫలితాలుకూడ వుంటాయి.

మొదటి ప్రపంచ యుద్ధం తరువాత బ్రిటను తన పాలసీ కొనసాగించుకోడానికి జాతిసమితిని వినియోగించుకుంది. ఇపుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఉదాహరణకు:— మిత్రరాజ్య సమితిలో బ్రిటను అమెరికాలు సమాన హోదాతో కలసి పనిచేస్తున్నట్లుగా కన్పించుతుంది కాని, తరచిచూస్తే వాటిలో ఏది ప్రధానపాత్ర వహించుతూందో, ఏది రెండోపాత్ర వహించుతూందో సులభంగా తేలిపోతుంది. అంతర్జాతీయ రంగంలో నేడు ఎచటచూచినా యిదే దృశ్యం మనకు కన్పించుతుంది. విద్రోహశక్తులు బ్రిటనుచేత సోవియట్ వ్యతిరేక దృక్పథాన్ని అనుసరించునట్లు చేసేకొలదీ, అంతర్జాతీయ రంగంలో విప్లవ వ్యతిరేక పోలీసుగా పనిచేసేకొలదీ, బ్రిటను అమెరికాపై ఎక్కువగా ఆధారపడవలసి వస్తుంది.

ఈ పరిస్థితులన్నీ ఒక విషయాన్ని రుజువు చేస్తున్నాయి. బ్రిటను - అమెరికాల మధ్య వైరుధ్యాలు వున్నాయి. యింకా అవి వృద్ధిచెందుతాయి. అవీ, వాటితో పాటువున్న ఇతర సామ్రాజ్యవాద వైరుధ్యాలూ కలసి పెట్టుబడిదారీ దేశాల మధ్య అనేకరకాల పోరాటాలను తెస్తాయి.

కాని యీ వైరుధ్యాలప్రాముఖ్యాన్ని ఎక్కువఅంచనా వేయడంకూడ పొరపాటే అవుతుంది. ఈ వైరుధ్యాల పరిణామాన్ని గమనించేటప్పుడు రెండు విషయాలను గుర్తుంచుకోవాలి.

(1) అమెరికా - బ్రిటను ఫైనాన్సు పెట్టుబడిదారుల మధ్యవున్న సంబంధాలు;

(2) బ్రిటీషు సామ్రాజ్యంలోని ఆంతరంగిక వైరుధ్యాలు – బ్రిటీషు పలుకుబడిక్రిందనున్న దేశాలమధ్యనున్నటువంటి వైరుధ్యాలు.

ఈ పరిస్థితులు బ్రిటీషు రాజకీయ జీవితంలో రెండు దృక్పథాలను కలిగించాయి. ఇందులో ఒకవర్గం బ్రిటను తన భావిగతిని అమెరికాతో ముడిపెట్టుకోవడంకంటే వేరుగత్యంతరం లేదని భావిస్తూంది. ఈ భాగస్వామ్యంవల్ల బ్రిటను తప్పకుండా నష్టపడుతుంది. అయినప్పటికీ సామ్రాజ్యాన్ని రక్షించుకోడానికి అంతకంటే వేరుమార్గంలేదు. మధ్య ప్రాచ్యంలోని నూనెగనుల విషయంలో బ్రిటను అమెరికాతో ఈమధ్య ఒడంబడిక చేసుకుంది. ఆ సందర్భంలో బ్రిటీషు పత్రికలలో కొన్ని పై దృక్పథాన్నే వెల్లడించాయి. మధ్య ప్రాచ్యంలో బ్రిటిషుపెట్టుబడిని ఒక పాలుకునెట్టి అమెరికా పెత్తనం సంపాదించుతుందనే విషయానికి యీ పత్రికలు అసంతృప్తి వెల్లడించాలిసింది. కాని అవి అందుకు విరుద్ధంగా చేశాయి. అరబ్బు దేశాలలో శాంతిని కాపాడటానికి, బ్రిటీషు స్థానాలను రక్షించడానికీ అమెరికా కూడ ప్రోత్సహించుతుందనే ఆశను వెల్లడించాయి.

పై దృక్పథాన్ని వెల్లడించే ముఠానుంచే భవిష్యత్తులో ఆంగ్లో – అమెరికన్ సంబంధాలను గురించిన ప్లానులు బయలుదేరుతున్నాయి. ఆంగ్లో – అమెరికన్ ఫెడరేషన్ నిర్మించాలనే ప్లాను, ఆంగ్లో – అమెరికన్ మిలిటరీ ఒడంబడిక చేసుకోవాలనే ప్లాను వీరినుంచే వచ్చాయి.

అమెరికాపైన పూర్తిగా ఆధారపడవలసివచ్చినందుకు గర్వకన్సర్వేటివులుకూడ కొందరు చికాకు పడు

తున్నారు. పశ్చిమ యూరపు బ్లాకు నిర్మాణానికి జరుగుతున్న ప్రయత్నాలు ఒకవైపున సోవియటుకు వ్యతిరేకంగా వుద్దేశింపబడుతున్నాయి. రెండోవైపున అమెరికాకు వ్యతిరేకంగా బ్రిటను స్వాతంత్ర్యాన్ని కాపాడుకోవాలని వుద్దేశింపబడుతున్నాయి.

ఈ వుద్దేశాలన్నీ ఒకే సంగతి రుజువుచేస్తున్నాయి. పూర్వపు సామ్రాజ్యవాద పద్ధతులు బ్రిటను సమస్యలను పరిష్కరించడానికి మార్గం చూపడంలేదు. ఇంగ్లండులో చాల మంది ప్రజలు, రాజకీయంగా బాధ్యతగల స్థానాలలో వున్న వారు - పార్లమెంటులో వున్నవారుకూడ యీ సత్యాన్ని గ్రహించారు. లేబరుపార్టీలోని కొందరు ముఖ్యులుకూడ, ప్రస్తుత పాలసీని విడనాడి, శాంతిపైన సోవియట్‌తో మిత్రత్వంపైన ఆధారపడిన పాలసీని అనుసరించితే తప్ప బ్రిటను స్వతంత్ర పాత్రను వహించలేదని స్పష్టంగా తెలుసుకుంటున్నారు.

ఇదొకటే పరిష్కార మార్గం. మ్యూనిక్ ద్రోహం నుంచి కాస్ట్రో - కూజ్ట్రో శేడాతో బ్రిటను అనుసరించుతున్న పాలసీని బ్రిటను వదులుకోవాలి. ప్రధానంగా ఆ పాలసీయే ఫాసిస్టు దురాక్రమణకు, రెండవ ప్రపంచ యుద్ధానికి దారి తీసింది. పెట్టుబడిదారీ ప్రపంచంమీద అమెరికా మానపత్య (ప్రాబల్యానికి) దారితీసింది.

రెండో దృక్పథంవారు ఆంగ్లో - అమెరికన్ ఒడంబడికకు ప్రమాదాన్ని గ్రహించారు. ప్రపంచంలోని సామ్రాజ్య వ్యతిరేకులకు, అభ్యుదయ శక్తులకు విరుద్ధంగా యీ కూటమి పనిచేస్తుందని తెలిసికున్నారు. దానిచాటున అమెరికా

ఫైనాన్సు పెట్టుబడి తన కబంధ హస్తాలను సాచుతూంది. బ్రిటను ఆర్థికంగానూ, రాజకీయంగాను మరింతగా అమెరికాపై ఆధారపడవలసి వస్తూంది. అంతర్జాతీయంగా తన స్థానాన్ని మరింత కోల్పోతుంది. బ్రిటీషు పాలసీని నిర్ణయించడంలో ఈ రెండు పంథాలకు మధ్య తీవ్రమైన ఘర్షణ జరుగుతోంది. భవిష్యత్తులో యీ ఘర్షణ మరింత తీవ్రమవుతుంది. దీని ఫలితంపైనే వివిధజాతుల మధ్య సహకారం, గతి ఆధారపడుతుంది.

ఈ సందర్భంలో యింకో విషయాన్ని కూడ తెలుపవలసివుంది. అమెరికన్ సామ్రాజ్యవాదుల దురాక్రమణ పాలసీని ఆదేశంలోనే క్రమంగా ఎక్కువమంది ఎదిరించుతున్నారు. ఆపాలసీ అమెరికాకు-ప్రపంచానికి కూడ మరో విపత్తును తెచ్చిపెడుతుందని చాలమంది అనుకొంటున్నారు. అమెరికా ప్రభుత్వంలో యీమధ్యవచ్చిన మార్పులకు అంతర్జాతీయ రాజకీయాలలో వున్న అభిప్రాయభేదాలే కారణం. అమెరికా స్వాతంత్ర్య సాంప్రదాయాలున్న దేశం. అది ఇతర దేశాలలోని విద్రోహకశక్తులకు అండగా నిలబడటం అన్ని దేశాలలోని అభ్యుదయశక్తులకు బాధాకరంగా వుంది. వారంతా అమెరికాలోనే ఫైనాన్సు పెట్టుబడిదారుల కుట్రలకు వ్యతిరేకంగా ప్రజాభిప్రాయం బలపడుతుందని ఆశించుతున్నారు.

ముందు సంగతి ఎలావున్నప్పటికీ నేడుప్రపంచంలోని ప్రజాస్వామికశక్తులు, స్వాతంత్ర్యాభిలాషులయిన జాతులు, ప్రమాదకరమైన అమెరికా సామ్రాజ్యవాదుల విద్రోహ పాలసీని నిత్యం ప్రతివిషయంలోనూ ఎదుర్కోవలసివస్తూంది.

నాజీల దురాక్రమణకు, దౌర్జన్యపద్ధతులకు పూనుకుంటున్న సామ్రాజ్యవాదాన్ని ఎదిరించవలసి వస్తూంది. పెట్టుబడిదారీ మోనోపలీలు, రాజకీయ దురాక్రమణతో పెనబెట్టులని అనుభవం మరొకసారి రుజువు చేస్తోంది.

యుద్ధానంతరం వచ్చిన అంతర్జాతీయ ఘటనలు అన్నిటిలోనూ యీవిషయం రుజువు అయింది. గత సంవత్సరం ఒక వుపన్యాసంలో చర్చిలు, తానూ ప్రెసిడెంటు ట్రూమన్ కలసి పోట్సుడం సమావేశంలో అటంబాంబును ప్రయోగించాలనే నిర్ణయం చేసుకున్నామని చెప్పుకున్నారు. అప్పటినుంచీ భవిష్యత్తునుగురించి వారి అభిప్రాయాలు మారిపోయాయి అని కూడ చెప్పుకున్నాడు.

వాస్తవంగా ఆ నిమిషంనుంచీ బెదిరింపుల పాలసీ ప్రారంభమయింది. శాంతికోరకు జరిగే ప్రతి ప్రయత్నంలోనూ బెదిరింపులు యిమిడి వున్నాయి. ఈపాలసీ ఒక్క అటంబాంబు విషయంలోనే కాదు. యుగోస్లోవియాను గుర్తించడానికి జరిగిన ఆలస్యంలోనూ, ట్రీస్టీనుంచి తొలగిపోవాలనే బెదిరింపులలోనూ, పోలెండు ఆంతరంగిక విషయాలలో జోక్యం కలిగించుకోడంలోనూ, గ్రీసు-ఆల్బేనియా స్పెయినుల యెడల అనుసరించిన దృక్పథంలోనూ, యిదే పాలసీ ద్యోతకమయింది. తరువాత ఇటలీతోనూ, యితర వుపగ్రహ దేశాలతోనూ శాంతి ఒడంబడికలు తయారు చేయవలసి వచ్చింది. వీటిలోనూ, ప్యారిస్ సమావేశంలోనూ పశ్చిమ రాజ్యాలు విచిత్రదృక్పథం అవలంబించాయి. సోవియట్ యూనియన్, యుగోస్లోవియా తదితర మిత్ర రాజ్యాల న్యాయమైన అవసరాలను గుర్తించలేదు. నిన్నటి

దురాక్రమణదారులను పశ్చిమరాజ్యాలపై ఆధారపడేటట్లుగా చేసి మళ్ళీ రేపు యింకో లోకవిపత్తుకు దారితీయడానికి సిద్ధపడ్డారు. జర్మనీలోనూ, తదితర ఆక్రమిత దేశాలలోనూ నిన్నటి ఫాసిస్టులను మరల ముఖ్యస్థానాలలో పెడుతున్నారు. ఫాసిస్టు వ్యతిరేకులను అణచివేస్తున్నారు. కొందరు సామ్రాజ్యవాదులు తమకు పునాదిగా జర్మన్ ఫాసిస్టులను వినియోగించుకోవాలని ప్రయత్నించుతున్నారు. నేడు జర్మనీకోసం జరిగే పోరాటం యూరపులో చాల ప్రాముఖ్యమయినది. అందుచేతనే జర్మనీలోని ఫాసిస్టులకు, విద్రోహశక్తులకు రక్షణ యివ్వటానికి సామ్రాజ్యవాదులు కృషిచేస్తున్నారు. దీనితోబాటు గత రెండు యేళ్ళుగా సోవియట్ యూనియన్‌కు, యుగోస్లోవియాకు, తదితర ప్రజారాజ్యాలకు, ప్రజాస్వామిక వుద్యమాలకు వ్యతిరేకంగా నిందలను తీవ్రంగా ప్రచారం చేస్తున్నారు. చర్చిలు చెప్పినట్లుగా పోట్స్‌డం తరువాత పశ్చిమ దేశాలలో కొన్నివర్గాల అభిప్రాయాలు యీవిధంగా మారాయి.

ఈ పాలసీ పర్యవసానం ఏమిటంటే సామ్రాజ్యవాదుల 'ఆశీస్సులను' గౌరవించనివారిపైన తమ యిష్టాన్ని బలవంతంగానైనా రుద్దాలని కొన్ని పెట్టుబడిదారీవర్గాలు కాంక్షించుచున్నాయి. వేరుమాటల్లో చెప్పాలంటే వారు ప్రపంచం నెత్తిపైన 'కొత్త సామ్రాజ్యవాద శాంతిని' రుద్దాలని చూస్తున్నారు. నిజమైన ప్రజాస్వామిక శాంతికి బదులు ఫైనాన్సు పెట్టుబడిదారులకు ప్రపంచాధిపత్యం అంటగట్టే శాంతిని ఏర్పరచాలని కోరుతున్నారు. వివిధ జాతుల స్వాతంత్ర్యం, సహకారం, పరస్పర శ్రేయస్సు యెడల గౌరవము పెంపొందించే శాంతిని వారు కోరుటలేదు.

కాని సామ్రాజ్యవాదుల పాలసీ యికముందు అభ్యంతరం లేకుండా కొనసాగదు. వెర్సైల్స్ సమావేశంలో మొదటి ప్రపంచ యుద్ధానంతరం సామ్రాజ్యవాదుల ఆటలు అలా సాగాయి. అప్పుడు సోవియటు యూనియన్ను ప్రపంచాన్నుంచి వేరుచేయగలిగారు. సామ్రాజ్యవాద వ్యతిరేకశక్తులను పరిమితులలో వుంచగలిగారు. నేటి పరిస్థితులు వేరు. సోవియటు యూనియనును ఒంటరిగా చేయడం సాధ్యపడదు. మరికొన్ని ప్రజారాజ్యాలు స్థాపించబడ్డాయి. అవి సామ్రాజ్యవాదుల శృంఖలాలనుండి పూర్తిగా బయటపడ్డాయి. చాలా దేశాలలో సామ్రాజ్యవ్యతిరేక వుద్యమాలు. ప్రజావుద్యమాలు బలమైన స్థానాలు సంపాదించాయి. అవి సామ్రాజ్యవాదుల కుట్రలను అరికట్టడానికి తగినంత బలం కలిగివున్నాయి.

ప్రజాస్వామికశక్తులు న్యాయమైన శాంతికోసం, జాతులమధ్య సహకారంకోసం పోరాడుతాయి. వివిధదేశాల ప్రయోజనాలను గౌరవించే పునాదిపై ఆధారపడిన శాంతికోసం కృషిచేస్తాయి. రెండు ప్రపంచాలమధ్య వున్న వైరుధ్యాలు స్వాతంత్ర్యాభిమానులైన మానవజాతికోరే జాతులమధ్య సహకారానికి అడ్డుగా రాకూడదు; వేరువేరు సామాజికాభిప్రాయాలు కలిగివున్నంతమాత్రాన ప్రపంచ శాంతికి, ప్రజాస్వామికానికి భంగం కలుగరాదు. సామ్రాజ్యవాదుల ఆర్థిక – రాజకీయ మార్గక్రమం ఫలితంగానే వాటికి భంగం కలుగుతోంది. నేడు అంతర్జాతీయ రాజకీయరంగంలో రెండు పంథాలు, రెండు మార్గాలు, రెండు దృక్పథాలు పని చేస్తున్నాయి. ఒకపంథా ప్రపంచాధిపత్యంకోసం కృషిచేస్తోంది.

సామ్రాజ్య విస్తరణకోసం. ఇతర జాతులపైన, ప్రభుత్వాల పైన పెత్తనం చెలాయించడానికి ప్రయత్నిస్తూంది. బెదిరింపులతోనూ, అధికఓట్లతోనూ లొంగదీయాలని చూస్తూంది. రెండో పంథా వివిధ జాతులమధ్య శాంతియుత సహకారం కోసం కృషిచేస్తూంది. ప్రతిజాతి న్యాయమైన హక్కులను గౌరవించుతుంది. పరస్పర విశ్వాసాన్ని పెంపొందించుతుంది. వలసదేశాలకు, బానిసప్రజలకు సంపూర్ణస్వాతంత్ర్యంకొరకు కృషిచేస్తుంది. ఈ రెండుపంథాలు వాస్తవంలో రెండుసామాజిక విధానాలకు ప్రతిబింబాలు. ఉదాహరణకు సామ్రాజ్యవాదవిధానం తన సమస్యలను రానున్న ఆర్థికసంక్షోభాన్ని పరిష్కరించుకోడానికి దురాక్రమణ-దౌర్జన్యాల పైన ఆధారపడిన పాలసీని అనుసరించుతూంది. సోషలిష్టు విధానము, నూతనప్రజారాజ్యాలు తమదేశాలలో పునర్నిర్మాణము - ప్రజాక్షేమం దృష్టిలోవుంచుకొని కృషిచేస్తున్నాయి. యుద్ధంముగిసినప్పటి నుంచీ యీ రెండు పంథాలు అంతర్జాతీయ రాజకీయాలలో స్పష్టంగా కన్పించుతున్నాయి.

యుగోస్లోవియాలో నూతన ప్రజారాజ్యం స్థాపించబడింది. పెట్టుబడిదారీ విధానంయొక్క కుటిలవేళ్లు తెగగొట్టబడ్డాయి. అది విదేశ సామ్రాజ్యవాదుల పలుకుబడినుండి బయటపడింది. అందుచేత అంతర్జాతీయ విద్రోహశక్తులు దానిని అనేకవిధాల ఒత్తిడి చేస్తున్నాయి. వివిధ ప్రజల న్యాయమైన హక్కులను కొన్ని మిత్రరాజ్యాలు వ్యతిరేకించుతున్నాయి. అందుకు సామ్రాజ్యవాదుల పాలసీయే కారణమని పైసంగతులవల్ల బోధపడుతుంది.

అందుచేత కొంతమంది చెబుతున్నట్లుగా యిప్పుడు

జరుగుతున్నది 'రెండు ఆదర్శాలమధ్య ఘర్షణ' కాదు. లేక మరికొందరు వాదించుతున్నట్లుగా 'భౌతిక వాదం - ఆదర్శ వాదం' అనుసరించే వారిమధ్య వివాదమూ కాదు. సమిష్టి వాదము - వ్యక్తివాదము అనుసరించేవారి మధ్య తగాదా కాదు. సామ్రాజ్యవాదుల దురాక్రమణకూ జాతుల స్వాతంత్ర్యానికీ మధ్య ఘర్షణ. సామ్రాజ్యవాదానికి - ప్రజాస్వామిక శాంతినికోరే స్వాతంత్ర్య ప్రియులైన మానవజాతికి మధ్య ఘర్షణ.

"మనకు నేడు రెండురంగాలు వున్నాయి. ప్రజాస్వామిక రంగము - విద్రోహుల రంగము. అంతేగాని పశ్చిమరంగము - తూర్పురంగము అనేవి లేవు." అని కామ్రేడ్ టిటో 1946 ఆగష్టు 20 వ తేదీ ఉపన్యాసంలో చెప్పాడు.

ఇదంతా ఒకేసంగతిని రుజువు చేస్తూంది. మానోపలీ పెట్టుబడిదారీ విధానం ప్రస్తుతదశలో తన అంతర్గత వైరుధ్యాలను పరిష్కరించుకోడానికి రాజకీయ దురాక్రమణకు పూనుకుంటుంది. ప్రజాస్వామిక శక్తులకు, అభ్యుదయానికి సోషలిజానికి వ్యతిరేకంగా పోరాడుతుంది.

వేమన గ్రంథాలయం పంచాయతీ
తెలప్రోలు :: కృష్ణా జిల్లా
40

5. ప్రపంచ ప్రజాశక్తులు

పైన మేము వర్ణించినదంతా సత్యంలో ఒక భాగం మాత్రమే. అమెరికా ఫైనాన్సు పెట్టుబడి తన ప్రాబల్యాన్ని కనివిని యెరుగనంతటి వేగంగా విస్తరింప చేసుకోడాన్ని నేడు ప్రపంచమంతా చూస్తోంది. అదేసమయాన సామ్రాజ్య విధానంయొక్క పునాదులు రెండో ప్రపంచ యుద్ధానంతరం నేడున్నంత బలహీనంగా ఎన్నడూ లేవు.

రెండో ప్రపంచయుద్ధం పెట్టుబడిదారీ ప్రపంచాన్ని కుదుట పరచలేదు. పైపెచ్చు సంక్షోభాన్ని మరింత తీవ్ర పరచింది. కొద్దికాలంలోనే తీవ్రమైన ఆర్థిక-రాజకీయ పోరాటాలు వస్తాయనడానికి ఎట్టి సందేహంలేదు.

రెండో యుద్ధకాలంలో మరి కొన్ని దేశాలు సామ్రాజ్యవాదుల పెత్తనాన్ని కూలదోశాయి. ఇందువల్ల తక్కిన ప్రపంచంలోకూడ సామ్రాజ్యవాదుల పరిపాలన కొంత ప్రతిష్టను గోల్పోయింది. ముఖ్యంగా వలసదేశాలలో దెబ్బతింది. పెట్టుబడిదారీ ఆర్థికవిధానంలో అంతర్గత వైరుధ్యాలు ఎక్కువయ్యాయి.

తూర్పు యూరపులోనూ, దక్షిణ యూరపులోనూ కొన్ని దేశాలలో ప్రజారాజ్యాలు ఏర్పడ్డాయి. ఇతర దేశాలలోకూడ అలాంటి మార్పే జరుగుతోంది. కాని వివిధ దశలలో అనేక రూపాలలోవుంది. రెండో ప్రపంచయుద్ధం తరువాత పెట్టుబడిదారీ ప్రపంచంలో జరుగుతున్న యీమార్పు చాలప్రాముఖ్యమైనదనడానికి ఏమీ సందేహంలేదు.

దీని ఫలితంగా ప్రపంచంలో వర్గశక్తుల సంబంధాలలో మార్పు వచ్చింది; డెమాక్రసీ, సోషలిజం బలపడ్డాయి. సామ్రాజ్యవాదం బలహీనపడింది. పెట్టుబడిదారీ విద్రోహుల పరిపాలనను కూలదోయడానికి ప్రత్యేక మార్గాలు కనుగొనబడ్డాయి. సోషలిజంవైపు ముందుకు సాగిపోడానికి నూతన రూపాలు కనిపెట్టబడ్డాయి. ఇకముందు సోషలిస్టు నిర్మాణమనేది ఒక సోవియటు యూనియన్‌కు సంబంధించినదే కాదు. జయప్రదం అవుతుందా కాదా అనే విషయం రుజువు చేసికోవలసిన అవసరంలేదు. సోవియటు విప్లవం సాధించిన విజయాలు చరిత్రపరీక్షకు నిలబడ్డాయి. ప్రపంచంలోని ప్రజాభ్యుదయంకోరే ప్రజాస్వామికవాదులందరి ఆమోదాన్ని పొందుతున్నాయి. పెట్టుబడిదారీ విధానాన్ని బహిరంగంగా సమర్థించే ప్రభుత్వాలు నేడు చాలాలేవు. పెట్టుబడిదారీ విద్రోహులు నామమాత్రపు సోషలిస్టు నినాదాలను వల్లించుతున్నారు. తాముకూడ సోషలిస్టు పద్ధతులు అనుసరించుతున్నట్లుగా అభినయించుతూ ప్రజలను మోసపుచ్చాలని చూస్తున్నారు. ఫాసిస్టులు సైతం నేడు సోషలిస్టు నినాదాల వెనుక దాక్కుంటున్నారు. అంటే సోషలిజానికి వ్యతిరేకంగా ప్రత్యక్ష పోరాటంలోకి దిగటానికి సామ్రాజ్యవాద విద్రోహులకు కూడ అసాధ్యమవుతూంది. అంటే సోవియటు యూనియన్ మొదటిసారి అసలు జరుపబడిన సోషలిజం చరిత్ర పరీక్షకు నిలబడిందన్నమాట. సోషలిస్టు ఆదర్శం జయం పొందిందన్నమాట,

రెండోవైపున పెట్టుబడిదారీ విధానంయొక్క బలహీనతలు చాలావున్నాయి. అక్టోబరు విప్లవం తరువాత

దశలో అప్పటికి సామ్రాజ్యవాదం యింకా బలంగా వుండేది. అందుచేత రష్యన్ విప్లవంపైన, యితర దేశాల సోషలిస్టు విప్లవోద్యమాలపైన ప్రత్యక్షదాడి చేయగలిగింది. ఇప్పుడు దానికాశక్తి లేదు. సామ్రాజ్యవాద కోటగోడల బీటులనే పూడ్చలేక పోతూంది. ముంచుకువచ్చే సంక్షోభంలాంటి తన సమస్యలనే పరిష్కరించుకోలేక పోతూంది. పెట్టుబడి దారీ విధానంయొక్క యీ బలహీనతలవల్ల నిజమైన ప్రజా స్వామికం, సోషలిజం కోసం జరిగే పోరాటాలు వివిధ రూపాలు తీసికోటానికి అవకాశం ఏర్పడుతోంది.

నిజమైన ప్రజాస్వామికవాదులు విశాలమైన ప్రజానీకం పైన ఆధారపడి పనిచేయవచ్చు. సామ్రాజ్యవాద విధానంలో ఏర్పడుతున్న బీట్లను వినియోగించుకోవచ్చు. చాలా దేశా లలో కమ్యూనిస్టు పార్టీలు తమదేశ ప్రభుత్వాల పాలసీని నిర్ణయించడంలో ప్రముఖపాత్ర వహించగలిగినంత బలంగా వున్నాయి. పెట్టుబడిదారీ మానోపలిస్టుల ప్రజా వ్యతిరేక కుట్రలను జయప్రదంగా బయటపెట్టగలిగినంత బలంగా నేడు ప్రజాస్వామిక శక్తులు వున్నాయి.

అంతర్జాతీయ రంగంలో యిప్పుడు సోవియట్ యూని యన్ వహించుతున్న పాత్రను దృష్టిలో వుంచుకుంటే పై విషయాల పూర్తిప్రాముఖ్యత బోధపడుతుంది. రెండో ప్రపంచ యుద్ధానికి పూర్వం అది వహించిన పాత్రకూ, నేడు వహించుతున్న పాత్రకూ, ఎంతో తేడావుంది. సోవియట్ యూనియన్ ఏర్పడిన నాటినుండీ అది స్వాతంత్ర్యాభిలాషు లైన ప్రజలందరికీ ఆశాజ్యోతిగావుంది. మానవజాతి అభ్యు దయం కోరేవారందరికీ చక్కని ఉదాహరణగావుంది.

సామ్రాజ్యవాద విధానం తెచ్చిన మహాసంక్షోభంనుంచి బయటపడే మార్గం చూపే ఆదర్శరాజ్యంగా వుంది.

ఐనప్పటికీ ఆరోజుల్లో పెట్టుబడిదారీ వలయం సోవియటును తక్కిన ప్రపంచాన్నుంచి వేరు పరచింది. అందుచేత, అంతర్జాతీయ రాజకీయాలలో సోవియట్ యూనియన్‌కు తన బలానికి తగినంత పలుకుబడి లేకపోయింది. నేడు అలాకాదు. సోవియట్ యూనియన్ చుట్టూ పెట్టుబడిదారీ వలయం యింక లేదని మనం చెప్పవచ్చు. సోవియట్ సరిహద్దులలో వున్న చాలాదేశాలు మిత్ర రాజ్యాలుగా వున్నాయి. కొన్ని దేశాలలో పెట్టుబడిదారీవర్గ పరిపాలన కూలిపోయి ప్రజా రాజ్యాలు ఏర్పడ్డాయి. కొన్నిటిలో పెట్టుబడిదారీ పునాదులు కదలిపోతున్నాయి. ఇంతేకాక, మరిరెండు సంగతులను కూడ మనం గమనించాలి.

(1) ఇపుడు అంతర్జాతీయ రంగంలో సోవియట్ యూనియన్ బ్రహ్మాండమైనపలుకుబడి కలిగివుంది. యుద్ధంలో తన అపార త్యాగాలద్వారా లోకవిపత్తును తప్పించింది. విజయంద్వారా తనబలాన్ని, సోవియట్ విధానము-సోషలిజము యొక్క గొప్పతనాన్ని, ప్రపంచానికి చాటింది. తత్ఫలితంగా సోవియట్ యూనియన్ విశేషపలుకుబడిని గడించింది.

(2) సోషలిస్టు ప్రపంచానికి, పెట్టుబడిదారీ ప్రపంచానికిమధ్య సరిహద్దులు రెండోవిషయం. యుద్ధానికి పూర్వం మాదిరిగా సోవియట్ యూనియన్‌కు-తక్కిన ప్రపంచానికి మధ్య ఖచ్చితమైన సరిహద్దులు లేవు. పూర్వంమాదిరిగా ఐక్యతతో కూడిన పెట్టుబడిదేశాలు ఒకవైపున, చుట్టు ముట్టబడిన సోషలిస్టు దేశం రెండోవైపున లేవు. ఇపుడు ఒకవైపున

పెట్టుబడిదారీ దేశాలకు మొనగాడుగా ముందు పీటీగా సామ్రాజ్యవాద శక్తులు నిలచాయి. రెండోవైపున సోవియట్ యూనియన్ నాయకత్వాన ప్రజాస్వామిక దేశాలు వున్నాయి. ఇలాంటి పరిస్థితులలో సోవియటు యూనియన్ను ఒంటరిగా వేరుచేయడం అసంభవం. అంతర్జాతీయరంగంలో ప్రధాన సమస్యలపైన సోవియటు యూనియను పాల్గొనకుండా నిర్ణయాలు చేయడం, అంతర్జాతీయ సహకార అవకాశాలను నాశనం చేయడం, అసంభవమయిపోయింది.

ఈ సందర్భంలో యింకో సత్యాన్నికూడ గమనించాలి. ప్రస్తుత పరిస్థితులలో వివిధ శక్తులమధ్య వున్న సంబంధాలనుబట్టి సామ్రాజ్యవాద గొలుసు త్వరత్వరగా అనేక చోట్ల తెగుతూ వుంటుంది. అందుచేత ప్రజా విజయాలు అనేక రూపాలలో రావడానికి అవకాశాలున్నాయి. ఆ విజయాల పునాదిపై సోషలిష్టు సమాజ నిర్మాణంవైపు సాగిపోడానికి అవకాశాలున్నాయి. ప్రపంచంలో వివిధ భాగాలలో సాగిపోతున్న ప్రజాస్వామిక విజయాల గొంతు పిసకడం, అణచివేయడం, సామ్రాజ్యవాద శక్తులకు క్రమ క్రమంగా మరింత కష్టం అవుతోంది.

తూర్పు - ఆగ్నేయ యూరపు దేశాలలో ప్రజారాజ్యాలు ఏర్పడటం, కొన్ని యితర దేశాలలో అందుకు పునాదులు వేయబడటం, చాలా ప్రాముఖ్యత వహించుతూంది. అంతర్జాతీయ రాజకీయాలలోనూ, సంబంధాలలోనూ సంఖ్యాబలం రావడమే కాదు. సోషలిజం విజయం పొందిన దేశం చుట్టూవున్న పెట్టుబడిదారీ వలయాన్ని బద్దలు చేయడం జరిగింది. ప్రపంచంలోని సామ్రాజ్య వ్యతిరేక

శక్తులు, ప్రజాస్వామిక - అభ్యుదయ శక్తులు జరిపే పోరాటానికి నూతనావకాశాలు కలిగాయి.

వలసదేశాల ప్రజావుద్యమాలు

యుద్ధానంతరం వలసదేశాల సమస్య మరల ఉగ్ర రూపందాల్చింది. ఈతీవ్రత రెండు రకాలుగావుంది. ఒక వైపున వలసదేశాల ప్రజలకు-పాలించే సామ్రాజ్యవాద దేశాలకు వున్న సంబంధాలు విషమించాయి. మరోవైపున ముఖ్యపెట్టుబడిదారీ మానోపలీల మధ్య అనగా పెద్ద పెట్టుబడిదారీ దేశాలమధ్య-రాజకీయ ఆర్థిక పోరాటం తీవ్రమయింది.

జాతీయ స్వాతంత్ర్యం కొరకు జరిగే పోరాటాలకు, యుద్ధాలకు కేంద్రాలని యిదివరకు మేము వాడాము. అప్పుడు మాదృష్టిలో భారతదేశము, సగం వలస దేశమైన చైనావుంది. ఆ రెండు దేశాలతోపాటు నేడు అనేక దేశాలలో అనేకరూపాలలో అనేక దశలలో స్వాతంత్ర్య పోరాటాలు జరుగుతున్నాయి. ఇండోనీషియా, ఇండో చైనా, ఫిలిప్పైనులు, కొరియా, అరబ్ దేశాలు, ఉత్తర ఆఫ్రికా వగయిరా...అంటే సామ్రాజ్య వ్యతిరేక వుద్యమం దాదాపు వలసదేశాల ప్రపంచమంతటా వ్యాపించింది. బానిస ప్రజల స్వాతంత్ర్యోద్యమాలను పరిపాలకులు తాత్కాలికంగా అణచివేయగలుగుతారనే విషయం ఇచట ప్రధానంకాదు. ముఖ్యమైన విషయమేమంటే - వలస దేశాలన్నిటిలోనూ చైతన్యవంతమైన సంఘటిత స్వాతంత్ర్యోద్యమం బయలుదేరింది. వలసదేశాలను బానిసత్వంలోఅణచివుంచడం పరిపాలకులకు క్రమంగా కష్టతరమవుతూంది. దీని

వలస పాలక దేశాలలోనూ, పెట్టుబడిదారీ ప్రపంచంలోనూ రాజకీయ-ఆర్థిక పరిస్థితులు మరింత విషమించుతాయి. వలస దేశాలలోని స్వాతంత్ర్యోద్యమాలు పెంపొంది బలపడటానికి కారణాలివి. ఒకవైపున యుద్ధకాలంలో ప్రజల రాజకీయ చైతన్యం పెంపొందింది. మరొక వైపున వలస దేశాలలో పరిశ్రమలు కొంత పెంపొందాయి. తత్ఫలితంగా రాజకీయ రంగంలోకి కార్మికవర్గము, జాతీయ పెట్టుబడిదారీవర్గమూ వచ్చాయి. జాతీయ సంస్కృతి పెంపొంది, మేధావంతులు ముందుకొచ్చారు. ప్రజలను వెనుకబడిన ఫ్యూడల్ వాతావరణంలో వుంచి, పూర్వపద్ధతిలో పరిపాలించడం సాధ్యపడటంలేదు. అందుచేత వలసదేశాల సమస్య సామ్రాజ్యవాద విధానంయొక్క పునాదులనే కదల్చి వేస్తూంది. పాలక దేశాలకు విషమ సమస్యగా పరిణమించుతూంది.

వలస దేశాలలోనూ, అస్వతంత్ర దేశాలలోనూ కార్మికవర్గం, కార్మికోద్యమం పెంపొందడంవల్ల స్వాతంత్ర్యోద్యమాలు పూర్వంకంటే ఉన్నత స్థాయికి వచ్చాయి. వీటిలో చాల వుద్యమాలు రాజకీయ స్వాతంత్ర్యంకోసం పోరాడటమే గాకుండా, సామ్రాజ్య వ్యతిరేక శక్తుల విజయంకోసంకూడా పోరాడుతున్నాయి. సామ్రాజ్యవాదంయొక్క పలుకుబడి నుండి తమ దేశాలను సంపూర్ణంగా వేరుచేసి, ప్రజల డెమాక్రటిక్ ప్రభుత్వాలను స్థాపించాలని పోరాడుతున్నాయి. పరిపాలకులు మిలిటరీని, పోలీసులను ఉపయోగించుటద్వారా పూర్వం మాదిరిగా ఎక్కువకాలం యీ వుద్యమాలను అణచి వేయలేక పోతున్నారు. కొన్ని తిరుగుబాటులను అణచి వేయడంలో ఒక వేళ జయంపొందినా, పూర్వకాలపు వలస

రాజ్యపాలనక్రింద కానిస ప్రపంచం భద్రంగా వుండేలాగు కన్పించడంలేదు. ఈ విధానంక్రింద పాలకదేశ ఫైనాన్సు పెట్టుబడి సురక్షితంగావుండేలాగులేదు. అందుచేత సామ్రాజ్య వాదులముతా క్రమక్రమంగా మరింత ఎక్కువగా జాతీయ పెట్టుబడిదారీవర్గంపైనా, వలస దేశాలలోని విద్రోహపు ముఠాలపైనా (Reactionary circles) ఆధారపడవలసి వస్తూంది. అందుకుగాను వారికి కొన్ని సంస్కరణలు (Concessions) యివ్వవలసి వస్తూంది.

సామ్రాజ్యవాదుల కొత్త యెత్తులు

అందుచేతనే కొన్ని వలసదేశాలు నామమాత్రపు 'స్వాతంత్ర్యాన్ని' పొందినట్లుగా వార్తలను యీ మధ్య విరి విగా వింటున్నాము. బ్రిటను తన వలసదేశాలలో కొన్ని టికి స్వతంత్రం యిచ్చివేసినట్లుగా ప్రకటించింది. అలాంటి ప్రకటనలు కేవలం కొత్తగా ఏర్పడిన 'స్వతంత్ర దేశాలలోని పాలకవర్గాలను లోబరచుకోవడానికి చేయబడుతున్నాయి. అలాచేయడంవల్ల సామ్రాజ్యవాదులు ఆదేశాలను వాస్త వంగా తమపై ఆర్థికంగానూ - రాజకీయంగానూ ఆధారపడి వుండేలా చేయగలుగుతారు.

ప్రస్తుత సామ్రాజ్యవాద రాజకీయాలలో అలాంటి పద్ధతులు నిత్యకృత్యాలు అవుతున్నాయి. ప్రపంచం అన్ని భాగాలలోనూ ప్రజాస్వామికానికి విరుద్ధమైన పరిపాలన నిల బెట్టడానికి సామ్రాజ్యవాదులు ప్రయత్నించుచుతున్నారు. అనేక దేశాలలో ప్రజలు ఎన్నడో కూలదోసివుండే నిరంకుశ ప్రభుత్వాలు విదేశ సామ్రాజ్యవాదుల సపోర్టుతో నిలబడి వున్నాయి.

ఫైనాన్సు పెట్టుబడి విపరీతంగా కేంద్రీకరించబడటమూ, పెట్టుబడి మానోపలీలు బ్రహ్మాండంగా వ్యాపించడమూ ఫలితంగా పూర్వకాలపు వలసరాజ్యాల దోపిడీ విధానం ఇక ముందు పనికిరాదని స్పష్టపడుతూంది. అమెరికాలో ఫైనాన్సు పెట్టుబడి కేంద్రీకరణా, మానోపలీలు ప్రపంచమంతటా వ్యాపించడం ఫలితంగా వలసరాజ్యాలను పూర్వం మాదిరిగా ప్రాంతాలుగా విభజించుకోవడానికి వీలులేదు. ప్రస్తుత మానోపలీలకు ప్రపంచమంతా కావాలి. కొలది వలసరాజ్యాలు చాలవు. దేశాల సరిహద్దులతో నిమిత్తం లేకుండా ప్రపంచమంతటా అవి విహారం చేయాలి. పోటీ పెట్టుబడిదారులను మార్కెట్టునుండి, క్రమంగా అన్ని ఆర్థిక స్థానాలనుండి తొలగించాలి. అందుచేతనే బ్రిటిషు - ఫ్రెంచి వలసవిధానాలను తనకుఆటంకాలుగా అమెరికా ఎంచుతోంది. అందుచేతనే వారు వలసదేశాల "స్వాతంత్ర్యానికి" అనుకూలంగా ప్రకటించుతున్నారు. ఈప్రకటనల వుద్దేశం ఆచరణలో బ్రిటను, ఫ్రాన్సు, హాలండులకు వలసగావున్న దేశాలకు 'నామమాత్రపు స్వాతంత్ర్యం' యివ్వాలి. అవన్నీ అమెరికా ఫైనాన్సు పెట్టుబడిపైన ఆర్థికంగానూ, రాజకీయంగానూకూడ ఆధారపడే స్థితికిరావాలి.

వలసరాజ్యాలకు కలిగివున్న బ్రిటను, ఫ్రాన్సులలాంటి దేశాలు యిప్పటికే అమెరికా ఫైనాన్సు పెట్టుబడిపై చాలా వరకు ఆధారపడుతున్నాయి. వాటి సమస్య సహజంగా వేరుగా వుంటుంది. వలసరాజ్యాలపైన పూర్తి రాజకీయ కంట్రోలు కలిగివుండటం సాధ్యమా అనే ప్రశ్నకు సమాధానం అమెరికాకు వ్యతిరేకంగా బ్రిటన్, ఫ్రాన్సులు

ఎంతవరకు స్వతంత్ర పాత్రను వహించగలుగుతాయా అనే విషయంపై ఆధారపడి వుంటుంది. ప్రపంచంలో తమ ఆర్థిక - రాజకీయ స్థానాలను బ్రిటను, ఫ్రాన్సులు నిలబెట్టుకో గలుగుతాయా అనే సంగతిపై ఆధారపడి వుంటుంది. అందు చేతనే అవి తమ వలసదేశాలను నిలబెట్టుకోడానికి అంత తీవ్రంగా కృషి చేస్తున్నాయి.

1946 అక్టోబరు 'లేబరు' మాసపత్రికలో ఎవన్ సాంటేగూ యిలా వ్రాశాడు :

"ప్రస్తుత సమయంలో బ్రిటీషు, అమెరికన్ సామ్రాజ్య వాదుల మధ్యపోటీ,వారివారి ప్రయోజనాలకున్న వైరుధ్యమూ స్పష్టమైన రూపాలను దాల్చుతోంది. ఒకటి, రాజకీయాధి కార పాలసీ - రెండోది డాలర్ ప్రాబల్య పాలసీ. ఉత్పత్తిలో బలహీన పడివున్న బ్రిటను ఒడంబడికల ద్వారాను, సామ్రా జ్యంలో ప్రత్యేక రక్షణలద్వారాను, తనకు అనుకూలమైన సుంకాలద్వారాను మాత్రమే అమెరికాతో వర్తకంలో పోటీ చేయగలుగుతుంది. విపరీతమైన ఉత్పత్తిశక్తిని కలిగివున్న అమెరికా యీ ఆటంకాలను తొలగించడానికి ప్రయత్నిస్తు తూంది. ప్రతి ప్రాంతానికి సమాన ఎగుమతి సౌకర్యాలు యివ్వాలనీ, అందరికీ సమానావకాశాలు వుండాలనీ అమెరికా పట్టుపట్టుతూంది. అనగా ఆచరణలో తన ఆధిక్యతను స్థాపించు కోడానికి కృషి చేస్తూంది."

అమెరికా కుటిలనీతి

దీనివల్ల విచిత్రమైన పరిస్థితి యేర్పడుతూంది. తమ డాలర్లతోనూ, తమఎగుమతులతోనూ విశ్వమంతా వ్యాపిం చుతూ, పెట్టుబడిదారీ ప్రపంచాన్నంతనూ జయించుతున్నది

అమెరికా కోటీశ్వరులు, గుత్తవ్యాపారులు. కాని వారే 'డెమాక్రసీ', 'కాలనీల విముక్తి', 'స్వాతంత్ర్యప్రదానం' అనే మాటలతో ప్రదర్శనాలు చేస్తున్నారు. అమెరికా డాలరు దాడినుంచి తమ స్థానాన్ని కాపాడుకోడానికి అవస్థ పడుతున్న బ్రిటనుకు తన సామ్రాజ్యాధికారాన్ని కాపాడుకోడం తప్ప వేరు సాధనంలేదు. అందుచేత అది సామ్రాజ్యవాదానికి పోలీసు అధికారి పాత్రను ధరించి అపఖ్యాతిపాలవుతూంది. వలసదేశాలకు 'స్వాతంత్ర్యం' అని అమెరికా వల్లించుతున్న నినాదం వాస్తవంలో విపరీతమైన పెట్టుబడి కేంద్రీకరణకు మాత్రమే ప్రతిబింబం. ఆచరణలో ప్రపంచాధిపత్యానికి ప్రయత్నం. పెట్టుబడిదారీ ప్రపంచాన్నంతటిపైనా పెత్తనం చెలాయించాలని అమెరికా మానోపలీలు చేస్తున్న కృషికి ప్రతిబింబం. జర్మనుసామ్రాజ్యవాదులు దేనికొరకు అర్రులు చాచి విఫలులయ్యారో. దానిని తాము సాధించగలమని అమెరికను కోటీశ్వరులు విర్రవీగుతున్నారు.

వలసరాజ్యాలలోనూ, అస్వతంత్ర దేశాలలోనూ పరిస్థితులు యిలావుంటే మరొకవైపున స్వతంత్ర దేశాలు చిన్నవి-పెద్దవికూడ క్రమంగా ఆర్థికశానిసత్వానికి లోనవుతున్నాయి. అమెరికా ఫైనాన్సు పెట్టుబడిపై ఆధారపడే అస్వతంత్ర దేశాలుగా మారిపోతున్నాయి. పెట్టుబడిదారీ ప్రపంచంలో యిదేమీ కొత్తసంగతికాదు. కాని యీ మార్పు యిప్పుడు విపరీతమైన వేగంతో జరిగిపోతూంది. అమెరికా ఫైనాన్సు పెట్టుబడికి లాభప్రదంగా యీమార్పుసాగిపోతూంది. వర్తకం, మొనోపలీల నిర్మాణం, అప్పులు, పెట్టుబడులు, స్థానిక పరిశ్రమాభివృద్ధికి ఆటంకాలు, అనేక రకాల ఆర్థిక వత్తిడి —

వీటన్నిటినీ అమెరికా ఫైనాన్సు పెట్టుబడి ప్రయోగించుతూంది. తద్వారా వివిధ పెట్టుబడిదారీ దేశాలలో వ్యాపించుతోంది.

ఈ ఆర్థిక బానిసత్వంవల్ల ఆయా దేశాల అభివృద్ధి అరికట్టబడుతుంది. దారిద్ర్యం మరింత హెచ్చుతుందనే విషయములో ఏమీ సందేహంలేదు. ఇలాంటి ఆర్థికసతి ఆ దేశాల ప్రజలకు వినియోగించదు. విదేశీ ఫైనాన్సు పెట్టుబడికీ లాభాలు చేకూర్చుతుంది.

ఈ సందర్భంలో అమెరికా ఆర్థిక విస్తరణను గురించి ఒక అమెరికా ప్రచారకుని మాటలను యిచట ఉదహరించుతాను. దీనివల్ల ఒక దేశ స్వాతంత్ర్యాన్ని గురించి మానా పాలకవర్గాల దృష్టి ఎలావుంటుందో బోధపడుతుంది.

"అమెరికా వస్తువులను, సహాయాన్ని కోరుతున్న దేశాల ఆర్థిక క్షేమాన్ని దృష్టిలో వుంచుకోకుండా కేవల అమెరికా ఆర్థికప్రయోజనాలకొరకు సహాయాలనే పథకాలు ఉద్దేశింపబడుతున్నాయని మమ్మల్ని కొందరు విమర్శించవచ్చు. ఈ విమర్శను మేము మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాము. అమెరికా ఆర్థిక పాలసీని ఇతర దేశాల న్యాయమైన ఆర్థికడిమాండులను దృష్టిలోవుంచుకొని నిర్ణయించాలి. మా ప్రయోజనాలు, ఇతర దేశాల ప్రయోజనాలు ఒకే కొలబద్దతో కొలవడానికి సాధ్యమైనపుడల్లా, అలాచేయాలి. కాని అమెరికా ప్రయోజనాలకు నష్టం వాటిల్లేటప్పుడు మాత్రం ఏమైనాసరే అమెరికా ప్రయోజనాలను రక్షించడమే ప్రధానాశయంగా వుండాలి."

వేరుమాటలో చెప్పాలంటే అమెరికా తన ప్రయో

జనాలకు అనుకూలించినంతవరకు మాత్రమే ఇతర దేశాల స్వాతంత్ర్యాన్ని గుర్తించుతుంది. కాని తన స్వార్థానికి విరుద్ధమైనపుడల్లా ఇతర దేశాల స్వాతంత్ర్యం ఎగిరిపోతుంది. లేదా 'అమెరికా ప్రయోజనాలకు' తలవొంచాలి.

పై వాక్యాల్లో మిష్టర్ ఆటో కొరికన్ బహిరంగంగా సులభమైన మాటల్లో అమెరికా ఫైనాన్సు పెట్టుబడి అనుసరించే మానసిక ప్రవృత్తిని తెలియజేశాడు.

దాని రాజకీయ ఫలితాలుకూడ స్పష్టమే. ఏమంటే ఎచట ఆర్థిక ప్రయోజనాలు వుంటాయో, అచట రాజకీయ ప్రయోజనాలుకూడ వుండితీరాలి. అందుచేతనే 'స్వతంత్ర దేశాల' ఆంతరంగిక విషయాలలో జోక్యం కలిగించుకోవడమనేది, సామ్రాజ్యవాదుల పాలసీలో నేడు ప్రధాన భాగమయిపోయింది.

ఉదాహరణకు దక్షిణఅమెరికాలోని తమ పెట్టుబడులను గురించి. జాయింటు పెట్టుబడులవల్ల అమెరికాకుకలిగే లాభాలను గురించి వ్రాస్తూ 1946 జూన్ 8 వ సంచికలో 'ఎకనమిస్టు' పత్రిక యిలావ్రాసింది.

"లాటిన్ అమెరికాలో తమ పెట్టుబడులు సురక్షితంగానూ,లాభప్రదంగానూఉంటాయా అనే విషయం విదేశాల పెట్టుబడిదారులను చాలకాలంనుంచీ బాధించుతూంది...... అమెరికా వ్యాపారస్తులు అంతకంటే తక్కువ ప్రమాదకరమైన వాటికి తమ పెట్టుబడులను వినియోగించారు. జాయింటు పెట్టుబడి పద్ధతి చాల నమ్మకమైనది. అమెరికా పెట్టుబడిని—స్థానిక పెట్టుబడితో కలిపి కంపెనీలు ఆర్గనైజ్ చేయుటమూ, పూర్వంవలెగాక మేనేజ్‌మెంటులోకూడ స్థానిక పెట్టుబడి

దారులను చేర్చుకోవడమూ చాలా శ్రేష్ఠమయింది. మెక్సికోలో యీ రూపంలోనే చాలా అభివృద్ధి జరిగింది ...... వెస్టింగ్ హౌస్ కంపెనీ యీ పద్ధతినే అర్జెంటైనాలో అనుసరించింది. ఇతరులు బ్రెజిల్, చిలీ దేశాలలో యిదే మార్గాన్ని అనుసరించారు.....జాయింటు పెట్టుబడి లాటిన్ అమెరికన్లకు చాల ఆకర్షణీయంగా వుంది. డబ్బున్న వారికి ప్రమాదం ఏమీ లేకుండా పెట్టుబడి పెట్టడానికి కొత్త అవకాశాలను కలిగించుతుంది. ఆ వ్యాపారాన్ని జయప్రదంగా విదేశభాగస్తులు నడిపి తీరుతారని స్థానిక భాగస్తులకు పూర్తి నమ్మకముంటుంది.

"అమెరికా కంపెనీలు వ్యాపార విస్తరణకోసం పరుగెత్తుతున్నాయి కాని, లాభాలు పంచుకోవడంకోసం కాదు. జాయింటు కంపెనీలవల్ల తాము పెట్టవలసిన పెట్టుబడి తగ్గుతుంది. రెండోవైపున లాటిన్ అమెరికాలోనికి ప్రవేశించి భద్రంగా నమ్మకం చేసికోవడానికి అవకాశం లభించుతుంది.

"పెట్టుబడిదారులు సులభంగా తమ పలుకుబడిని వినియోగించగలుగుతారు. ప్రతి రాజకీయ గ్రూపులోనూ వున్న భాగస్వాములతో సంబంధాలుంటాయి. అందుచేత నాయకత్వ పద్ధతి మారినా తక్షణం ఏ ప్రభుత్వం వచ్చినా తమ పలుకుబడిని ఉపయోగించగలుగుతారు."

అమెరికా ఫైనాన్సు పెట్టుబడి యిప్పుడు ప్రధానంగా అనుసరించుతున్న 'జాయింటు కంపెనీల' పద్ధతికి యింకో ముఖ్యమైన లక్ష్యంకూడా వుంది. దీనివల్ల అమెరికా ఫైనాన్సు పెట్టుబడి యితర దేశాల ఫైనాన్సు పెట్టుబడితో మిళితం కావడానికి వీలుచిక్కుతుంది. వివిధ దేశాల ఆర్థికజీవితంలో

జోక్యం కలిగించుకోడానికి అవకాశం ఏర్పడుతుంది. ఇక ముందు అది కేవలం పిలువని పేరంటాలుకాదు; దానికి స్థానిక పెట్టుబడిదారీ వర్గ రక్షణ ఉంటుంది. ఈ విధంగా వివిధ దేశాల ఆంతరంగిక పాలసీలపై వత్తిడిచేయడమే గాకుండా, విదేశాంగ పాలసీపైనా, విదేశాలతో ఆర్థిక సంబంధాలపైన కూడా తన పలుకుబడిని వినియోగించ గలుగుతుంది. మిత్ర రాజ్యసమితి సమావేశాల్లోనూ, యితర అంతర్జాతీయ సమావేశాల్లోనూ దక్షిణ అమెరికా దేశాలు, తదితర దేశాలు చాలా హెచ్చుగా అమెరికా ప్రతిపాదనలను బలపరచడం లోని రహస్యమిదే. ఆయా దేశాల ప్రతినిధులపైన అమెరికా ఫైనాన్సు పెట్టుబడి ప్రాబల్యం, ఒత్తిడీవుందనే సంగతి తెలిసి కోడం ఏమంత కష్టమైన విషయంకాదు.

వలస దేశాలకు నామమాత్రపు స్వాతంత్ర్యము యివ్వడమూ, 'స్వతంత్ర' దేశాలు తమపై ఆర్థికంగా ఆధారపడేలా చేయడమూ - యీ పాలసీ నేడు జయప్రదంగా సాగుతూంది. ఫైనాన్సు పెట్టుబడి, సామ్రాజ్యవాద దృక్పథాలనుంచి ఇది సత్యంగానే వుంది. కాని అనేక విధాలుగా పెట్టుబడిదారీ విధానాన్ని నష్టపరుస్తూంది. ఇవన్నీ, ఫైనాన్సుపెట్టుబడి విపరీతంగా కేంద్రీకరించబడుతూందనీ, వ్యాప్తి చెందుతూందనీ తెలియ చేస్తాయి. కాని అదేసమయాన సామ్రాజ్యవాద విధానంయొక్క బలహీనతనుకూడ ప్రతిబింబించుతున్నాయి. బహిరంగంగా ఆక్రమించుకోడం వలస దేశాలను తన రాజకీయ పరిపాలన క్రిందకు తెచ్చుకొని మిలిటరీ బలంతో పరిపాలించడం సామ్రాజ్యవాదం పూర్వంనుంచీ అనుసరించు తున్న నమ్మకమైన సాధనాలు. ఈ ఆయుధాలు యిపుడు

పనికిరావడం లేదు. అయితే దీని అర్థం వాటిని యికముందు ఉపయోగించరనిగాదు; ఇంకో మార్గం లేనప్పుడు తప్పక ఉపయోగించుకుంటుంది. అంతేగాక పైన మేమువర్ణించిన పెట్టుబడి విస్తరణ పద్ధతివల్ల కొన్నిదేశాల అంతరంగిక వ్యవహారాలలో ఎల్లప్పుడూ జోక్యం కలిగించుకోవలసి వస్తుంది. ఇది కొంతవరకూ జనుపప్రదం తొలగుతుంది. కాని ప్రజల దృష్టిలో జాతీయ పెట్టుబడిదారీ వర్గము, స్థానిక విద్రోహ శక్తులు విదేశ సామ్రాజ్యవాదుల ఏజెంట్లుగా కనబడతాయి. అవి ప్రజాసామాన్యానికి దూరమవుతాయి. అందుచేత యీ పద్ధతుల వల్ల వివిధదేశాలలోని అంతరంగిక వైరుధ్యాలు మరింత తీవ్రమవుతాయి. ఒకవైపున విద్రోహ శక్తులు హింసాకాండకు పూనుకుంటాయి. ప్రజాస్వామిక హక్కులను భగ్నపరుస్తాయి. మరోవైపున డెమొక్రాటిక్ - సామ్రాజ్య వ్యతిరేక వుద్యమాలలోకి ప్రజాసామాన్యం హెచ్చుగా వస్తుంది. విదేశ సామ్రాజ్యవాదుల ఒత్తిడికి, వారి స్థానిక యేజెంట్లకు వ్యతిరేకంగా ప్రజాపోరాటం తీవ్రమవుతుంది.

ఈవిధంగా ప్రస్తుతం సామ్రాజ్యవాదు లనుసరించే పద్ధతిలోనే దానికి వైరుధ్యాలుకూడ ఇమిడి వున్నాయి. సామ్రాజ్యవాదం ప్రపంచాధిపత్యం కోసం కృషిచేస్తూంది; సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా స్వాతంత్ర్యోద్యమం పెంపొందడానికి పరిస్థితులను అదే సృష్టించుకొంది.

ఇవన్నీ పెట్టుబడిదారీ విధానానికి రానున్న మహా సంక్షోభాన్ని మరింత తీవ్రపరుస్తాయి.

6. రానున్న లోకవిపత్తు
స్వాతంత్ర్య ప్రియుల కర్తవ్యం

పెట్టుబడిదారీ ప్రపంచాన్ని ఎదుర్కొంటున్న విషమ సమస్యలివి. కొత్త ఆర్థికసంక్షోభం రాబోతూంది. దాని భీషణఫలితాలు ఏ విధంగా వుంటాయో చెప్పడం కష్టం. కాని ప్రపంచంలో వివిధభాగాలలో అనేక రాజకీయ విప్లవాలు వస్తాయని చెప్పడానికి ఎట్టిసందేహమూ లేదు. రాబోవు కాలంలో పెట్టుబడిదారీ ప్రపంచం కుదుటబడి శాంతంగా వుంటుందనుకోడం కేవలం వట్టి భ్రమ. పైన మేము సూచించిన పరస్పర వైరుధ్యాలు అన్ని రంగాలలోనూ నూతన పోరాటాలకు దారితీస్తాయి. అందుచేత ప్రపంచమంతా కృషి చేసినా, అందరూ కోరుతున్న శాంతికి ప్రమాదం రాబోతూంది. ఇపుడు వెంటనే ప్రపంచానికి యుద్ధం రాకపోవచ్చు; కాని డెమాక్రసీని కోరే మానవలోకమంతా పెట్టుబడిదారీ మానోపలీల దురంతాలను ఎదిరించకపోతే శాంతి లభ్యంకాదు. మనం యిపుడు పేరుకు 'శాంతి' అనుభవించుతున్నాము. కాని గ్రీసులో ఇండోనేషియాలో, చైనాలో, ఇండో చైనాలో, ఫిలిప్పైన్సులో, పాలస్టయిన్ లో, స్పెయిన్ లో, ఇరాన్ లో నేడు యుద్ధం సాగుతోంది. అందుకు కారణం సామ్రాజ్యవాదుల విస్తరణ ప్రయత్నాలే. రేపు మరికొన్ని వీటికి తోడుకావచ్చు. అవి సామ్రాజ్యవాద విధానాన్ని కదల్చి వేసేటంత ప్రాముఖ్యమైనవి కావచ్చు. ఒక్క

మాటలో చెప్పాలంటే పెట్టుబడిదారీ ప్రపంచం అశాంతి, గందరగోళం దశలోవుంది. సామ్రాజ్యవాద విద్రోహశక్తులకూ ప్రజాస్వామిక శక్తులకూ మధ్య తీవ్రమైన పోరాటాలు జరుగుతుంటాయి. ప్రజాస్వామిక శక్తులు క్రమంగా బలపడతాయి. కార్మికోద్యమం, ముఖ్యంగా యూరపు దేశాలలోని కార్మికోద్యమం యింకా అత్యున్నత స్థాయికి రాలేదనే సంగతి గుర్తించడం కూడ యీ సందర్భంలో అవసరం.

స్వాతంత్ర్యాభిలాషులందరూ పెట్టుబడిదారీ మానోపలీలు—ఫైనాన్సు పెట్టుబడి విస్తరించడంవల్ల రానున్న విపత్తును గ్రహించాలి. పెట్టుబడిదారీ దేశాలలోని ప్రజాస్వామిక శక్తులు తమకిపుడు సాధారణ పౌరహక్కులున్నాయినీ, తమ దేశానికి స్వాతంత్ర్యం వుందనీ సంతృప్తిచెంది, కళ్ళుమాసుకో రాదు. అంతకంటే పొరపాటు వుండబోదు. వాస్తవంగా నేడు రెండోరకపు పెట్టుబడిదారీ దేశాలన్నిటిలోకి విదేశ ఫైనాన్సు పెట్టుబడి, మానోపలీలుకాస్త హెచ్చుగానో తక్కువగానో ప్రవేశించాయి. నేడు యీ విస్తరణ యింకా 'డెమాక్రసీ-స్వాతంత్ర్యం' అనే నూతపదాల చాటున దాగివుంది. రేపు పెట్టుబడిదారీ ప్రపంచంలో ఆర్థికసంక్షోభం వచ్చేకొలదీ, అంతర్గత వైరుధ్యాలు పెరిగేకొలదీ, మానోపలీలు తమసహజ రంగును బయటపెడతాయి. వరుసగా దేశంవెంట దేశాన్ని రాజకీయ విద్రోహానికి, ఫాసిజానికి బలిచేస్తాయి.

అన్ని దేశాలలోనూ యీమానోపలీల మొదటదాడి అభ్యుదయాన్ని కోరే ప్రజాస్వామిక శక్తులపై సాగుతుంది. ముఖ్యంగా యీ శక్తులు అధికారంలో వున్న దేశాలపై కేంద్రీకరించబడుతుంది. మానోపలిస్టులు తమసామ్రాజ్యవాద

విధానంలోని అంతర్గత వైరుధ్యాలను తీర్చుకోడానికి అభ్యుదయ శక్తులపై దాడిని ప్రోత్సహించుతారు. సామ్రాజ్యవాద విధానంయొక్క బలహీనతవల్లనే వారు యిందుకు పూనుకొంటారనటంలో సందేహంలేదు. కాని యిందువల్లకూడ పెట్టుబడిదారీ ప్రపంచంయొక్క సంక్షోభం మరింత తీవ్రమవుతుంది.

పెట్టుబడిదారీ దేశాలలో ఆంతరంగిక వ్యవహారాలలో యీ సంగతి నిత్యం ద్యోతకమవుతూ వుంటుంది. గ్రీసుదేశం సంగతి అందరికీ తెలిసిందే. తక్కిన అన్ని దేశాలలో కూడ 'బలమైన ప్రభుత్వాలు' కావాలనే సాకుచెబుతూ విద్రోహ శక్తులన్నీ కలసి ఫాసిస్టుసంస్థలను నిర్మించడానికి కృషిచేస్తున్నాయి. ఈ ప్రయత్నాలన్నిటి వెనుకా ఫైనాన్సు పెట్టుబడిదారులున్నారు. మొదటి ప్రపంచయుద్ధానంతరం ట్రస్టులు, కార్టెల్సు (గుత్తవ్యాపార సంస్థలు) హిట్లరుకు డబ్బిచ్చి బలపరిచినట్లుగానే యిపుడు వీటిని బలపరుస్తున్నారు. వైరుధ్యాలు తీవ్రమయ్యేకొలదీ యీ ప్రయత్నాలు మరింత తీవ్రంగాసాగుతాయి. ప్రజలలో రాజకీయ చైతన్యం లేకపోతే వీరుగందరగోళం కలుగచేయగలుగుతారు. ప్రజావుద్యమాలు బలంగా లేకపోతే వీరు ప్రజలను తెమబూటకపు నినాదాలతో మోసపుచ్చగలుగుతారు. సామ్రాజ్యవాదులు ప్రజలు వెనుకబడి వున్నంతకాలమే బూర్జువా డెమాక్రసీనైనా అమలు జరుపుతారు. ప్రజలను దారిద్ర్యంలోవుంచి, దోచుకో కలిగినంతకాలమే ఆసూత్రాలనువల్లించుతారు. ప్రజలుసత్యాన్ని తెలిసికొన్నప్పుడు వారి రాజకీయ చైతన్యం అభివృద్ధిచెందినపుడు తమదేశ రాజకీయ జీవితంలో తగిన పాత్రను వహించసాగి

నపుడు యీ మూనోపలిస్టు ప్రచారకులు ప్రజాస్వామిక సూత్రాలను స్వస్తి చెబుతారు. అసలురంగుతో బయట పడతారు. ఉదాహరణకు గతసంవత్సరం ప్యారిస్ శాంతి సమావేశంలో 'ట్రీస్టే' నగరానికి ప్రజాస్వామిక హక్కులు యివ్వాలని సోవియట్ ప్రతినిధులు, యుగోస్లోవియా ప్రతినిధులు కోరారు. ఎల్లప్పుడూ 'డెమాక్రెటిక్ సూత్రాలను' వల్లించుతుండే బ్రిటను-అమెరికా ప్రతినిధులేవ్యతిరేకించారు. వారిలో ఒకాయనిలా సమర్థించుకున్నాడు.

'మేము డెమాక్రసీని ఎల్లప్పుడూ బలపరుస్తాము. ఈ విషయంలో మేము అందరికంటే ముందుంటాము. కాని 'ట్రీస్టే'లో ప్రజా స్వామిక సూత్రాలను అమలు జరపడానికి తగిన పరిస్థితులు లేవు' అని వాదించాడు.

అలాగే సామ్రాజ్యవాదుల దృష్టిప్రకారం ప్రపంచంలో చాలా దేశాలలో ప్రజాస్వామిక సూత్రాలను అమలు జరపడానికి 'తగిన పరిస్థితులు' వుండవు. ఫ్రాన్సులాంటి దేశాలలో "బలమైన ప్రభుత్వం" కావాలనే వాదనను సామ్రాజ్యవాదులు ఎందుకు చేస్తున్నారో పై విషయాన్నిబట్టి బోధపడుతుంది. జర్మనీ, ఆస్ట్రియా పశ్చిమభాగాలలో నాజీపుట్టలను నాశనం చెయ్యడానికి సామ్రాజ్యవాదులు ఎందుకు నిరాకరించుతున్నారో తేట తెల్లమవుతుంది. స్పెయినులో ఫాసిస్టు ఫ్రాంకో అధికారంలో యింకాఎందుకు వుండగలిగాడో తెలుస్తుంది. యుద్ధనేరస్తులు, ద్రోహులు ఎలాతప్పించుకొని సురక్షితంగా తిరుగగలుగుతున్నారో బోధపడుతుంది. అమెరికా-బ్రిటీషు సామ్రాజ్యవాదులు ఇతర దేశాల ఆంతరంగిక వ్యవహారాలలో జోక్యంకలుగ చేసుకుంటూ, ఆ యా దేశాలలోని

విద్రోహశక్తులను ఎందుకు బలపరుస్తున్నారో తేటతెల్లమవు తుంది.

మిత్రరాజ్య సమితిని యీ విద్రోహశక్తులన్నీ కలసి ఒక అంతర్జాతీయ పోలీసు సంస్థగా తయారుచేయాలని ప్రయ త్నించు తున్నాయి. 19 శతాబ్దపు మొదటి భాగంలో వున్న 'పవిత్రకూటమి' (Holy Alliance) లాంటి దానిని నిర్మిం చాలని చూస్తున్నారు. సామ్రాజ్యవాద మానోపలీల అధికా రాన్ని నిలబెట్టి, ప్రపంచంలో ప్రజాస్వామిక వుద్యమాలన్ని టినీ అణచివేయాలని కృషిచేస్తున్నారు. ఇందుకేవారు మిత్ర రాజ్యసమితిలో సోవియటకున్న 'వీటో' హక్కును తొలగిం చాలని చూస్తున్నారు. వారికబుర్లు అన్నిటివెనుకా దాగివున్న ఆశయం ఒకటే. మిత్రరాజ్య సమితిలో అమెరికన్-బ్రిటీషు సామ్రాజ్యవాదులకు తమ ఉపగ్రహాలతో కలసి మెజారిటీ వుంది. ఈ మెజారిటీని వినియోగించుకొని మిత్రరాజ్య సమి తిని తమ విద్రోహపాలసీని సాగించడానికి ఒక సాధనంగా విని యోగించుకోవాలని ప్రయత్నించుతున్నారు. సమిష్టి శాంతి రక్షణకొరకు నిర్మించబడిన సంస్థను సామ్రాజ్యవాదులు విస్త రణకు వినియోగించే సాధనంగా మార్చుకోవాలని కృషిచే స్తున్నారు. 'సమిష్టిబాధ్యత' సూత్రాలను సామ్రాజ్యవాదులు తమ ఆశలకొరకు బలిచేయాలని కుట్రపన్నుతున్నారు.

అలాంటి ప్రయత్నాలన్నింటినీ ఓడించే బాధ్యత ప్రజా స్వామిక శక్తులపై వుంది. మిత్రరాజ్య సమితిని, శాంతిని కాపాడే సమిష్టిసంస్థగా నిర్మించాలి. ప్రతి పెట్టుబడిదారీ దేశం లోనూ నిజమైన ప్రజాస్వామికాన్ని స్థాపించడానికి జరిగే పోరాటమూ, అంతర్జాతీయంగా ప్రజాస్వామిక శాంతికోసం.

ప్రజాస్వామిక సహకారంకోసం జరిగే పోరాటమూ అవినా భావ సంబంధం కలిగివుంటాయి.

కాబట్టి ప్రపంచంలో స్వాతంత్ర్యాభిలాషులయిన ప్రజాస్వామికవాదులందరూ అంతర్జాతీయ రాజకీయాలలో ముఖ్యమైన కర్తవ్యాలను నెరవేర్చాలి. వీటిపైనే ప్రతిదేశంలోను అభ్యుదయశక్తులకు-విద్రోహ శక్తులకు మధ్యజరిగే పోరాటం, జయాపజయాలు ఆధారపడి వుంటాయి. అందుచేత ప్రజాస్వామిక శక్తులు, సహకారంతో ఒండొరులను బలపరుచుకోవాలి; వివిధ జాతులమధ్య సహకారంకోసం ప్రజాస్వామిక శాంతికోసం కృషి చేయాలి. మనకు ప్రధాన ప్రమాదం ఎచటవుందో తెలుసు. సామ్రాజ్యవాద విద్రోహులు — ఫాసిస్టులూ మరల లోకవిపత్తు కల్పించ జేయకుండా అరికట్టడానికి స్వాతంత్ర్య ప్రియులైన మానవులంతా కృషి చేయాలి. అంతర్జాతీయ రాజకీయాల ప్రాముఖ్యతను తక్కువ అంచనా వేసినా, దేశీయ సమస్యల్లోనే కేవలం నిమగ్నులయినా, అంతర్జాతీయ రాజకీయాలు 'మనకెందుకులే' అనే ధోరణితో తాటస్థ్యం వహించినా, స్వాతంత్ర్య ప్రియుల ప్రయత్నాలకు ఓటమి తప్పదు. ఏ విధంగా 'శాంతి అవిభాజ్యమైనదో' ఆదేవిధంగా ప్రజాస్వామిక రాజ్యస్థాపనకోసం జరిగే పోరాటమూ అవిభాజ్యమైనదే.

పెట్టుబడిదారీ ప్రపంచంలో నేడున్న పరిస్థితులను పరిశీలించడంవల్ల మనప్రజలు కామ్రేడ్ టిటో నాయకత్వాన యుగోస్లావియా కమ్యూనిస్టుపార్టీ ఆధ్వర్యాన తాము సాధించిన విజయాల ప్రాముఖ్యతను తెలుసుకుంటారు. మనకు ఆర్థిక సంక్షోభం వస్తుందనే భయంలేదు. ఆంతరంగిక తగాదాలు

వస్తాయనే భీతిలేదు. సామ్రాజ్యవాదుల ఆర్థిక బానిసత్వం ప్రాప్తించుతుందేమోననే సందేహం అంతకంటేలేదు. పరిశ్రమాభివృద్ధి, విద్యుచ్ఛక్తి పెంపుదల, వ్యవసాయపునర్నిర్మాణం, ప్రజాక్షేమం, నాగరికత — వీటిని క్రమ క్రమంగా ఉన్నత స్థాయికి కొనిపోగలమనే స్పష్టమైన ఆదర్శాలు మన కంట్లె ఎదుట కనబడుతున్నాయి. విదేశ సామ్రాజ్యవాదుల బానిసత్వాన్ని కూలదోసిన స్వతంత్ర జాతులే అలాంటి ఆదర్శాలతో ముందుకు పోగలుగుతాయి.

మనకు మన స్వాతంత్ర్యం విలువ తెలుసు. అందు చేతనే సామ్రాజ్యవాదులచే దోచుకోబడుతున్న పీడితప్రజల స్వాతంత్ర్య పోరాటాలను మన ప్రజలు సానుభూతితో చూస్తున్నారు. అదే సమయాన ఆయాదేశాల సామాజిక-ఆర్థిక నిర్మాణాలతో నిమిత్తంలేకుండా మన ప్రజలు ప్రపంచ శాంతిని, అంతర్జాతీయ సహకారాన్ని కోరుతున్నారు.

యుగోస్లోవియా ప్రజారాజ్యాల ఫెడరేషను అనుసరించే విదేశాంగపాలసీ ప్రజలందరూకోరే శాంతి పాలసీయే. మన న్యాయమైన హక్కులను ఎంతపట్టుదలతో రక్షించుకుంటామో, అంతర్జాతీయ శాంతిని, ప్రజాస్వామిక హక్కులను అలారక్షించడానికి కృషిచేస్తాము. సోవియట్ యూనియన్‌తోనూ, ప్రపంచంలోని ఇతర ప్రజాస్వామిక దేశాలతోనూ, శక్తులతోనూ కలసి మన దేశ ప్రజలు ప్రపంచములో ప్రజాస్వామిక శాంతిని స్థాపించడానికి కృషిచేస్తారు. దేశంలో పునర్నిర్మాణానికి జరిగే ప్రయత్నాలు ఎంతముఖ్యమైనవో ప్రపంచశాంతికూడ అంత ముఖ్యమైనదని ప్రజలు తెలుసుకున్నారు.

BCI

TPLA101B108
BC

మనసు ఫౌండేషన్

పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	TRL [illegible] 101 13 108
పుస్తకం పేరు	[illegible]
తారీఖు	24/10/24
ముందు అట్ట	yes
వెనుక అట్ట	yes
మొత్తం పేజీలు	69
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	C1, BC1
లేని పేజీలు	NO
తయారు చేసినది	akshaya
పేజీలు విడదీసినది	[illegible]
స్కాన్ చేసినది	Susmitha
పరీక్ష చేసినది	PRAGATHI
పేజీలు సరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
స్కాన్ చెయ్యనివి	
తప్పులు	NO
పరిస్థితి	good